JAYABHERIDAILY.COM

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రభాత జయభేరి

ప్రజల పక్షాన అక్షర యజ్ఞం

ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
మేడ్చల్ - మల్కాజిగిరి । శనివారం 09-05-2026
Medchal - Malkajgiri । Saturday 09-05-2026

Follow: jayabherinews

సంపుటి : 02 । సంచిక : 342
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 342 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను

మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...

9391 544 889 call me

jayabheripaper@gmail.com



# బెంగాల్ తొలి బీజేపీ సీఎంగా సువేందు

- దీదీకి రెబెల్ నుంచి కీలక పోస్టుకు..!
- 2021 రాష్ట అసెంబ్లీ ఎన్నికలలో మమతా బెనర్జీని నందిగ్రామ్ స్థానంలో 1956 ఓట్లతో ఓడించి బీజేపీలో కీలకంగా ప్రతిపక్ష నేతగా, పశ్చిమ బెంగాల్ బీజేపీ యూనిట్ అధ్యక్షుడిగా పనిచేశారు
- మమతను రెండోసారి ఓడించి చరిత్ర సృష్టించిన సువేందును సహజంగానే బీజేపీ ముఖ్యమంత్రిగా అవకాశం

**జయభేరి, పశ్చిమ బెంగాల్ :**

పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో సువేందు అధికారి కీలక వ్యక్తి, రాష్ట్ర శాసనసభ ప్రతిపక్ష నాయకుడు. క్షేత్రస్థాయి నుండి బలమైన ప్రభావం కలిగి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి ప్రధాన ప్రత్యర్థి. మున్సిపల్ కౌన్సిలర్ నుండి జాతీయ నాయకుడిగా ఎదిగిన అధికారి ప్రస్థానం వ్యూహాత్మక రాజకీయ పరిణామాలకు నిదర్శనం. పుర్బా మేదినీపూర్ లో క్షేత్రస్థాయి కార్యకర్తగా కెరీర్ ప్రారంభించి.. నందిగ్రామ్ అసెంబ్లీ స్థానంలో చారిత్రాత్మక విజయంతో బెంగాల్ రాజకీయాల్లో నిరూపించుకున్న నేత. సువేందు బాల్యం, విద్యాభ్యాసం సువేందు అధికారి 1970 డిసెంబర్ 15న పశ్చిమ బెంగాల్‌లోని తూర్పు మేదినీపూర్‌లోని కర్కులిలో జన్మించారు. మాజీ కేంద్ర సహాయ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు శిశిర్ కుమార్ అధికారి, గాయత్రీ అధికారిల కుమారుడు. ప్రజా సేవకు అంకితమైన ఆయన కుటుంబం బెంగాల్ రాజకీయ చరిత్రలో పర్యాయపదంగా నిలిచింది. మేదినీపూర్ ప్రాంతంలో పెరుగుతూనే గ్రామీణ రాజకీయాల సంక్లిష్టతలను గమనించారు. ఇది ఆయనకు

...మిగతాది 2 లో

# విజయ్‌కి మళ్లీ బిగ్ షాక్

- రేపు ప్రమాణస్వీకారం కష్టమేనా..
- మెజారిటీకి అవసరమైన మ్యాజిక్ ఫిగర్‌కు ఇంకా ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతు అవసరమవడంతో విజయ్ శిబిరం కొత్త వ్యూహాలు




**- జయభేరి, చెన్నై :**

తమిళనాడు రాజకీయాల్లో మరోసారి హైడ్రామా మొదలైంది. అసెంబ్లీ ఎన్నికల్లో సంచలన విజయంతో అధికారానికి చేరువైన తమిళగ వెట్రి కజగం అధినేత విజయ్‌కు ఇప్పుడు సంఖ్యాబలం సవాలుగా మారింది. తొలుత మద్దతు ప్రకటించిన మిత్రపక్షాల్లో అనూహ్య మార్పులు చోటుచేసుకోవడంతో ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియపై మళ్లీ అనిశ్చితి నెలకొంది. 2026 అసెంబ్లీ ఎన్నికలు వన్ ఇండియాలో పూర్తి వివరాలు 234 స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే 118 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ఎన్నికల్లో టీవీకే 108 స్థానాలు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, పూర్తి మెజారిటీకి ఇంకా 10 స్థానాలు తక్కువగా నిలిచింది. దీంతో కాంగ్రెస్, వామపక్షాలు, ప్రాంతీయ పార్టీల మద్దతు కోసం విజయ్ తీవ్రంగా ప్రయత్నాలు ప్రారంభించారు.



# కొడంగల్‌లో 430 పడకల ఆసుపత్రి నిర్మాణం

*"కొడంగల్ ప్రజల సాక్షిగా దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా మార్చే బృహత్ కార్యక్రమాలు చేపట్టాం. వచ్చే ఏడాది డిసెంబర్ నాటి విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో కొడంగల్ రూపు రేఖలు మార్చేస్తాం. నారాయణ పేట - కొడంగల్ లిఫ్ట్ పథకం పూర్తి చేసి రైతుల పొలాలకు కృష్ణా జలాలు పారిస్తాం. కొడంగల్ లో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన సందర్భంగా యాగంలో పాల్గొన్నాను. అదే విధంగా 430 పడకల ఆసుపత్రి నిర్మాణం, కోస్గి వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశాను.*

**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

- 225 ఎకరాల్లో ఒక ఎడ్యుకేషనల్ హబ్ తీర్చిదిద్దబోతున్నామని
- మక్తల్ - నారాయణపేట - కొడంగల్‌కు నీళ్లు, రైల్వే లైన్, సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అవకాశం
- కృష్ణా నది జలాలతో ఈ ప్రాంత భూములు తడవాలి
- కోస్గీ నుండి నేరుగా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ వరకు 300 అడుగుల రోడ్డు వేస్తున్నాం
- కొడంగల్ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన

**జయభేరి, కొడంగల్ :**

అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా గుంపులు, గ్రూపులు పక్కన పెట్టి అందరం కలిసికట్టుగా పనిచేస్తే కొడంగల్ శాసనసభ నియోజకవర్గాన్ని రాష్ట్రానికే కాకుండా దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుకోగలుగుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. నియోజకవర్గాన్ని గొప్పగా అభివృద్ధి చేసుకోవాలన్న సంకల్పంతో తలపెట్టిన పనులను 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసుకుందామని పిలుపునిచ్చారు. కొడంగల్ లో శ్రీ వెంకటేశ్వర స్వామి (కొడంగల్ బాలాజీ) ఆలయ పునర్నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన యాగంలో పాల్గొన్నారు. మంత్రి దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా కొడంగల్‌లో 430 పడకల ఆసుపత్రి నిర్మాణం, దౌల్తాబాద్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, కోస్గి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాల అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి ఇక్కడి నుంచి శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోక నిర్లక్ష్యానికి గురైన పరిస్థితులను వివరిస్తూ, ప్రస్తుతం

...మిగతాది 2 లో

# రాయలసీమ ఇక రాయల్.. సీమ..

## ఆగస్టు 15న రెండున్నర లక్షల ఇళ్ల గృహప్రవేశాలు



**జయభేరి, విజయవాడ, మే 8 :**

ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్ ఏపీలో భారీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చింది. తిరుపతి జిల్లాలో సుమారు రూ. 2,200 కోట్ల వ్యయంతో మోటార్‌సైకిళ్ల తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయనుంది. సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశం ఈ ప్రాజెక్టుకు ఆమోదముద్ర వేసింది.ఈ శుభవార్తను సీఎం చంద్రబాబు తనదైన శైలిలో సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. "రాయల్ ఎన్‌ఫీల్డ్ రాయలసీమలోకి దూసుకుపోతోంది! రాయలసీమ ఇప్పుడు రాయల్ సీమ" అనే క్యాప్షన్‌తో ఓ బుల్లెట్ బైక్ ఫొటోను ఆయన పంచుకున్నారు. ఈ ట్వీట్ కొద్దిసేపట్లోనే వైరల్‌గా మారింది.తిరుపతి జిల్లా సత్యవేడు మండలంలోని వన్నెలూరు, రాళ్ళకుప్పం గ్రామాల్లో ఈ పరిశ్రమ కోసం ప్రభుత్వం 267 ఎకరాల భూమిని కేటాయించింది. రెండు దశల్లో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మొదటి దశను 2029 నాటికి, రెండో దశను 2032 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

**ఫైళ్లు క్లియెరెన్స్ కు ప్రశంసలు**

ప్రభుత్వ పాలనలో వేగం, పారదర్శకత పెంచడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. అమరావతి సచివాలయంలో రెండో రోజు కొనసాగిన కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఆయన ఫైళ్ల క్లియరెన్స్, టెక్నాలజీ వినియోగంపై అధికారులకు

...మిగతాది 2 లో




# యువకుడు దారుణహత్య

**- జయభేరి, హైదరాబాద్, మే 8 :**

ప్రేమ వ్యవహారంలో ఓ యువకుడు దారుణహత్యకు గురయ్యాడు. సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండి ఇందిరానగర్ ప్రాంతంలో గురువారం రాత్రి కొందరు గుర్తుతెలియని దుండగులు బీటెక్ విద్యార్థిని టార్గెట్ చేసి కత్తులతో పొడిచి చంపారు. కత్తులతో పొడవడంతో తీవ్ర రక్తస్రావంతో యువకుడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న వెంటనే చిలకలగూడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించి ఆధారాలను సేకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.సికింద్రాబాద్‌లోని చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. జవహర్‌నగర్‌కు చెందిన 23 ఏళ్ల యావన్ అనే బీటెక్ థర్డ్ ఇయర్ స్టూడెంట్ గుర్తు తెలియని వ్యక్తులు జరిపిన కత్తుల దాడిలో ప్రాణాలు కోల్పోయాడు. గత నాలుగేళ్లుగా సీతాఫల్‌మండికి చెందిన ఓ యువతిని ప్రేమిస్తుండటమే ఈ హత్యకు ప్రధాన కారణమని పోలీసులు భావిస్తున్నారు. వీరి ప్రేమ వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేసిన యువతి కుటుంబ సభ్యులు, గతంలోనే యావన్‌ను పలుమార్లు హెచ్చరించినట్లు సమాచారం.యువతి

...మిగతాది 2 లో

# రూ. 300 కోట్లు ఇస్తేనే కాంగ్రెస్‌లో ఉంటా..

- లేకుంటే బీజేపీలోకి వెళ్తా.. సొంత పార్టీకి షాకిచ్చిన మహిళా ఎమ్మెల్యే

**జయభేరి, మధ్యప్రదేశ్ :**

కాంగ్రెస్ మహిళా నేత సొంత పార్టీకే షరతులు పెట్టడం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తన నియోజకవర్గాన్ని జిల్లాగా ప్రకటించి.. అభివృద్ధి పనుల కోసం రూ.300 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేసింది. కాంగ్రెస్, బీజేపీలలో ఏ పార్టీ తన డిమాండ్లను తీరిస్తే.. తాను ఆ పార్టీలో ఉంటానని తేల్చి చెప్పింది. దీంతో ఇప్పుడు ఆ మహిళా ఎమ్మెల్యే చేసిన డిమాండ్‌తో రెండు పార్టీలు తలలు పట్టుకుంటున్నాయి. ఇంతకీ ఆ మహిళా ఎమ్మెల్యే ఎవరు?
మధ్యప్రదేశ్ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ మహిళా ఎమ్మెల్యే నిర్మలా సప్రే చేసిన సంచలన డిమాండ్ ఇప్పుడు తీవ్ర దుమారానికి కారణం అవుతోంది. కాంగ్రెస్ పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన నిర్మలా సప్రే.. ఇప్పుడు తన సొంత పార్టీ ముందే భారీ కండిషన్లు పెట్టడం మధ్యప్రదేశ్ రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న బీనా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.300 కోట్లు కేటాయించి.. బీనాను జిల్లాగా ప్రకటిస్తేనే తాను కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగుతానని నిర్మలా సప్రే స్పష్టం చేయడం తీవ్ర కలకలం రేపుతోంది. తాజాగా ఒక మీడియా ఇంటర్వ్యూలో మాట్లాడిన నిర్మలా సప్రే.. కాంగ్రెస్ నేత, మధ్యప్రదేశ్ ప్రతిపక్ష నాయకుడు ఉమాంగ్ సింఘర్‌కు బహిరంగంగా ఛాలెంజ్



విసిరారు. బీనా నియోజకవర్గ అభివృద్ధి కోసం రూ.300 కోట్లు ఇవ్వాలని.. అంతేకాకుండా బీనాను జిల్లాగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. తాను చేస్తున్న

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## 430 పడకల ఆసుపత్రి నిర్మాణం

చేపట్టిన పనుల గురించి సమగ్రంగా వివరించారు. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాంతంలో మెడికల్, ఇంజనీరింగ్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐలు, సైనిక్ స్కూల్స్.. 225 ఎకరాల్లో ఒక ఎడ్యుకేషనల్ హబ్ తీర్చిదిద్దబోతున్నామని చెప్పారు. అతివేగంగా పనులు జరుగుతున్నాయని చెబుతూ ఏడాది లోపు పనులన్నీ పూర్తి కావాలన్నారు. ఆనాడు చదువుకోవడానికి ఈ ప్రాంత వాసులు రాష్ట్రం నలుమూలల వెళ్లాల్సిన పరిస్థితి నుంచి ఈనాడు రాష్ట్రం నలుమూలల నుండి మంచి చదువుల కోసం కొడంగల్‌కు రావలసిన విధంగా పనులు చేపట్టామని తెలిపారు. "ఇప్పుడు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం వచ్చింది. మక్తల్ - నారాయణపేట - కొడంగల్‌కు నీళ్లు, రైల్వే లైన్, సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అవకాశం వచ్చింది. దేశంలో ఉండే గొప్ప గొప్ప పరిశ్రమలు రాబోయే రెండేళ్లలో ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. మక్తల్ - నారాయణపేట్ - కొడంగల్ ప్రాజెక్టును పూర్తి చేయాలి. కృష్ణా నది జలాలతో ఈ ప్రాంత భూములు తడవాలి. దీనికి జిల్లా ఇంచార్జి మంత్రి రాజనర్సింహ ప్రతి నెల సమీక్ష నిర్వహించాలని కోరుతున్నా. భూ సేకరణ పూర్తి చేసినం. అనుమతులు అన్నీ వచ్చాయి. పనులు ముందుకు సాగాలి" అని అన్నారు. "ఇప్పుడు నిధులకు అడ్డంకి లేదు. అన్ని మండలాలకు నీళ్లు తెచ్చుకునే అవకాశం ఉంది. పనులు వేగంగా జరిగే విధంగా సర్పంచులు, స్థానిక ప్రతినిధులు చురుకుగా పనిచేయాలి. కృష్ణా వికారాబాద్ రైల్వే లైన్‌కు కూడా సూత్రప్రాయంగా అనుమతి తెచ్చుకున్నాం. ఈ ప్రాంతంలో అపారమైన సున్నపురాయి ఉంది. టేకులగోడు ప్రాంతంలో పెద్ద ఎత్తున సిమెంట్ పరిశ్రమకు అన్ని అనుమతులు ఇచ్చినం. రాబోయే ఆర్నెళ్లలో సిమెంట్ పరిశ్రమ నిర్మాణం జరిగితే స్థానిక యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయి. పెద్ద ఇండస్ట్రియల్ పార్క్ ను లగచర్ల దగ్గర కట్టుకుంటున్నాం. కోస్గీ నుండి నేరుగా ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ వరకు 300 అడుగుల రోడ్డు వేస్తున్నాం" అని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రతి ఊర్లో చిన్న సమస్యలు, బేదాభిప్రాయాలు ఉంటాయి. అవన్నీ పక్కన పెట్టి మీరంతా కలిసి కట్టుగా ఉండాలి. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోవాలి అని పిలుపునిచ్చారు. "కొడంగల్ నియోజకవర్గ పరిధిలో 55 ఏళ్ల కిందట కీ.శే. నందారం నర్సింహులు ప్రారంభించిన ఈ పేదల తిరుపతిని, తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో పునర్నిర్మించే ఒక బృహత్తరమైన స్వామి కార్యాన్ని చేపట్టాం. ఇది జీవితంలో మళ్లీ రాని గొప్ప అవకాశం" అని వ్యాఖ్యానించారు. "తెలంగాణ పేదల తిరుపతిగా దీన్ని అభివృద్ధి చేయాలని చాలా మంది నాయకులు కలలు కన్నారు. వివిధ కారణాల చేత ఎప్పటికప్పుడు వాయిదా పడుతూ వచ్చింది. దేశం గర్వించదగిన ఆగమశాస్త్ర సలహాదారులు సుందర వరదాచార్యులు ఇక్కడ వీధుల్లో రథాన్ని తిప్పడానికి మీరు బాధ్యత తీసుకోవాలని నన్ను కోరడంతో ఆ కార్యక్రమాన్ని చేపట్టాం" అని వివరించారు. "ఇప్పుడాయన మన మధ్యలో లేకపోవడం తీరని లోటు. సుందర వరదాచార్యులు చివరి కోరికను తీర్చడంతో పాటు, వారిని ఈ ప్రాంతం, ఈ సమాజం గుర్తు పెట్టుకునే విధంగా మందిరాన్ని తీర్చిదిద్దుతాం. అలాగే, సుందర వరదాచార్యులు పేరు ఈ ప్రాంగణంలో ఏదో ఒక విడిదికి పెట్టాలని" ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, దేవాదాయ శాఖ అధికారులకు, జిల్లా కలెక్టర్ కి సూచించారు. "ఈ కార్యక్రమం రాజకీయాలకు అతీతమైనది. జెండా, అజెండాలకు సంబంధించినది కాదు. ఇది మన ప్రాంతం, రాష్ట్రం గర్వించదగ్గ ఒక గొప్ప అభివృద్ధి కార్యక్రమం. ఇక్కడి వారినే కాదు. కర్ణాటక, మహారాష్ట్ర నుండి వచ్చే ప్రజలను కూడా ఆశీర్వదించడానికి ఒక గొప్ప దైవ కార్యం. కొడంగల్ శాసనసభ నియోజకవర్గ ప్రతిష్టను దేశ స్థాయిలో విస్తరించడానికి ఇది దోహద పడుతుందని భావిస్తున్నా. ఈనాడు తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయి కొడంగల్ బిడ్డ మీ ముందు నిలబడ్డా.." అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## విజయ్‌కి మళ్లీ బిగ్ షాక్

ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ తమ మద్దతు ప్రకటించగా, వీసీకే, ఐయూఎంఎల్, సీపీఐ, సీపీఎం వంటి పార్టీలతో కూడా చర్చలు జరిగాయి. అయితే తాజా రాజకీయ పరిణామాలు టీవీకే శిబిరంలో ఆందోళన పెంచుతున్నాయి. మొదట టీవీకేకు మద్దతు ప్రకటించిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ అనూహ్యంగా వెనక్కి తగ్గినట్లు సమాచారం. మరోవైపు మద్దతు ఇస్తామని బహిరంగంగా ప్రకటించిన వీసీకే పార్టీ నుంచి గవర్నర్‌కు ఇప్పటివరకు అధికారిక లేఖ చేరలేదని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ప్రస్తుతం టీవీకే బలం 116 వద్దే నిలిచిపోయినట్లు తెలుస్తోంది. మెజారిటీకి అవసరమైన మ్యాజిక్ ఫిగర్‌కు ఇంకా ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతు అవసరమవడంతో విజయ్ శిబిరం కొత్త వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం. స్వతంత్ర ఎమ్మెల్యేలు, చిన్న పార్టీల నేతలతో సంప్రదింపులు కొనసాగుతున్నాయని చెన్నై రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ రాజకీయ అనిశ్చితి కారణంగానే గవర్నర్ ఇప్పటివరకు అధికారికంగా విజయ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయమని ఆహ్వానించలేదని సమాచారం. రాజ్‌భవన్ కూడా పూర్తి స్థాయి మద్దతు పత్రాలు అందిన తర్వాతే తదుపరి నిర్ణయం తీసుకునే అవకాశముందని తెలుస్తోంది. ఇక మరోవైపు డీఎంకే కూడా పరిణామాలను నిశితంగా గమనిస్తోంది. టీవీకేకు స్పష్టమైన మెజారిటీ రాకపోతే రాజకీయ సమీకరణాలు వేగంగా మారే అవకాశముందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కొన్ని పార్టీల ఎమ్మెల్యేలు చివరి నిమిషంలో తమ వైఖరి మార్చే అవకాశమూ ఉందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఎన్నికల ఫలితాల తర్వాత విజయ్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం దాదాపు ఖాయమనే వాతావరణం కనిపించినా, తాజా పరిణామాలతో పరిస్థితి మళ్లీ ఉత్కంఠభరితంగా మారింది. తమిళనాడు రాజకీయాల్లో వచ్చే 24 గంటలు అత్యంత కీలకంగా మారనున్నాయి. ప్రస్తుతం అందరి దృష్టి గవర్నర్ నిర్ణయం, టీవీకేకు లభించే అదనపు మద్దతుపైనే నిలిచింది.

## తొలి బీజేపీ సీఎంగా సువేందు

"భూమిపుత్ర" ఇమేజ్‌ను అందించింది. ఆయన అవివాహితుడు. పూర్తి సమయం రాజకీయ, సామాజిక సేవకు అంకితం చేశారు. తూర్పు మేదినీపూర్‌లోని కాంటాయ్ హైస్కూల్‌లో ప్రాథమిక, మాధ్యమిక విద్యను పూర్తి చేశారు. ప్రభాత్ కుమార్ కళాశాల నుండి B.A., 2011లో రవీంద్ర భారతి విశ్వవిద్యాలయం నుండి ఎంఏ పట్టా పొందారు. నేతాజీ సుభాష్ ఓపెన్ యూనివర్సిటీలో ఉన్నత విద్యను అభ్యసించారు. సువేందు రాజకీయ ప్రస్థానం సువేందు అధికారి ప్రస్థానం కాంగ్రెస్‌తో ప్రారంభమైంది. 1995లో కాంతి మున్సిపాలిటీకి కౌన్సిలర్‌గా మొదటి విజయం సాధించారు. 2006లో కాంటాయ్ దక్షిణ నియోజకవర్గం నుండి పశ్చిమ బెంగాల్ శాసనసభకు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నందిగ్రామ్ భూసేకరణ వ్యతిరేక ఉద్యమం (2007-2008) సమయంలో అధికారి ఇంటి పేరు అయ్యారు. భూమి ఉచ్ఛేద్ ప్రతిరోధ్ కమిటీకి నాయకుడిగా లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని విజయవంతంగా సవాలు చేసి, 2011లో మమతా బెనర్జీని అధికారంలోకి తీసుకురావడంలో నిర్ణయాత్మక పాత్ర పోషించారు. తమ్లుక్ నుండి రెండుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. (2009-2016) సేవలు అందించారు. 2016-2020 మధ్య రవాణా, నీటిపారుదల, జలవనరులు వంటి కీలక శాఖలకు రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2020 డిసెంబర్‌లో సైద్ధాంతిక భేదాలు, టీఎంసీలో వారసత్వ రాజకీయాలను వ్యతిరేకించి బీజేపీలో చేరారు. 2021 రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో సీఎం మమతా బెనర్జీని నందిగ్రామ్ స్థానంలో 1956 ఓట్లతో ఓడించి బీజేపీలో కీలకంగా ఈ విజయం తర్వాత ప్రతిపక్ష నేతగా, పశ్చిమ బెంగాల్ బీజేపీ యూనిట్ అధ్యక్షుడిగా పనిచేశారు. సువేందు ఆస్తులు 2026 నాటి అధికారిక ఎన్నికల అఫిడవిట్ ప్రకారం, సువేందు అధికారి మొత్తం నికర ఆస్తి సుమారు ₹85.87 లక్షలు. ఇందులో ₹20.72 లక్షల విలువైన చరాస్తులు (నగదు, బ్యాంక్ డిపాజిట్లు, KVP, NSC వంటి ప్రభుత్వ పొదుపు పథకాలు) ఉన్నాయి. ₹65.15 లక్షల విలువైన స్థిరాస్తులు ప్రధానంగా తూర్పు మేదినీపూర్‌లోని కర్కులి ప్రాంతంలో ఉన్న పూర్వీకుల భూమి, నివాస భవనాల రూపంలో ఉన్నాయి. 2024-25 ఐటీఆర్ ప్రకారం వార్షిక ఆదాయం ₹17.38 లక్షలు. ఆయనకు అప్పులు లేవు. రెండు సీట్లలో గెలిచి సీఎం సీటుకు.. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో సువేందు అధికారి నందిగ్రామ్, భవానీపూర్ వంటి కీలక స్థానాల నుండి పోటీ చేసి రెండు చోట్లా ఘన విజయం సాధించారు. దీంతో మమతను రెండోసారి ఓడించి చరిత్ర సృష్టించిన సువేందును సహజంగానే బీజేపీ ముఖ్యమంత్రిగా అవకాశం ఇస్తోంది. ఈ నేపథ్యంలో బెంగాల్ కు తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా ఆయన బాధ్యతలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. బీజేపీలో ప్రస్తుతం మోడీ, అమిత్ షాలకు విధేయుడిగా, బెంగాల్లో బలమైన రాజకీయ నేతగా ఉన్న సువేందు అధికారి సీఎంగా ఎలా రాణిస్తారన్నదానిపై రాష్ట్రంలో పార్టీ భవిష్యత్తు కూడా ఆధారపడి ఉంటుంది.

# విజయ్ కంటే..
# రాజేంద్ర అర్లేకరే ఫేమస్



దేశవ్యాప్తంగా కొద్దిరోజులుగా తమిళనాడు రాజకీయాలు సృష్టిస్తున్న సంచలనం మామూలుగా లేదు. ఈ ఎన్నికల్లో తమిళనాడు ప్రజలు ఏ పార్టీకి కూడా వన్ సైడ్ విక్టరీ ఇవ్వలేదు. ప్రభుత్వ వ్యతిరేకతను.. ప్రతిపక్షం పార్టీ మీద ఉన్న ఆగ్రహాన్ని ఏకకాలంలో ప్రదర్శించారు. అభిమానాన్ని కూడా చూపించారు. ఫలితంగా మూడు పార్టీలలో దేనికి కూడా గొప్పగా చెప్పుకునే మెజారిటీ రాలేదు. దీంతో ఈసారి తమిళనాడులో బంపర్ మెజారిటీ ఏ పార్టీ సాధించలేకపోయింది. కనీసం మ్యాజిక్ ఫిగర్ కు దగ్గరగా కూడా రాలేకపోయింది. దీంతో పొత్తులు.. సంకీర్ణాల గురించి చర్చ నడుస్తూనే ఉంది. అయితే ఇంతవరకు తమిళనాడులో ఏర్పడిన సందిగ్ధం తీరలేదు. విజయ్ పార్టీకి అత్యధికంగా స్థానాలు వచ్చినప్పటికీ.. ఆయనకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే బలం లేదు. ఇతర పార్టీల నేతలను కూడగట్టే ప్రయత్నం చేసినప్పటికీ అది సాధ్యం కావడం లేదు. దీంతో తమిళనాడులో రకరకాల రాజకీయాలు సాగుతూ ఉన్నాయి. ఇప్పటికే డీఎంకే తమిళనాడు రాజకీయాల మీద క్లారిటీ ఇచ్చేసింది. తాము ఎవరికి సపోర్ట్ చేయమని.. ప్రజల ఓటింగ్ ద్వారా లభించిన ప్రతిపక్ష స్థానాన్ని కొనసాగిస్తామని డీఎంకే అధినేత స్టాలిన్ ప్రకటించారు. దీంతో తమిళనాడులో రాజకీయాలు మరో మలుపు తీసుకున్నాయి. ఇప్పటికే రిసార్ట్ నుంచి ఎమ్మెల్యే విజయ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బుధవారం గవర్నర్ ను కలిశారు. కాకపోతే గవర్నర్ అడిగిన ప్రశ్నలకు టీవీకే అధినేత వద్ద సమాధానాలు లేకుండా పోయాయి. దీంతో గురువారం జరగాల్సిన ప్రమాణ స్వీకారం రద్దయింది. అంతేకాదు ఇప్పట్లో తమిళనాడులో ప్రభుత్వం ఏర్పడే అవకాశం కనిపించడం లేదు. తమిళనాడు రాజకీయాల్లో ఈ సందిగ్ధత కొనసాగుతున్న నేపథ్యంలో ఒక వ్యక్తి విజయ్ కంటే ఎక్కువ ప్రాచుర్యం పొందారు. మీడియా కూడా ఆయన గురించి విశేషంగా కథనాలను ప్రసారం చేస్తోంది. ఆ వ్యక్తి రాజకీయాలతో సంబంధం ఉన్నవారు కాదు. పార్టీలతోనూ సంబంధం ఉన్నవారు కాదు. ఆయన మరెవరో కాదు తమిళనాడు గవర్నర్ రాజేంద్ర అర్లేకర్. ఇటీవల విజయ్ గవర్నర్ కార్యాలయం వద్దకు వెళ్ళినప్పుడు రాజేంద్ర సాదరంగా స్వాగతం పలికారు. మెజారిటీ చూపిస్తేనే టీవీకే ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి ఇస్తామని అన్నారు. దీంతో రాజేంద్ర మీద తీవ్రస్థాయిలో చర్చ జరుగుతుంది. కొన్ని పార్టీలు రాజేంద్ర తీరును తీవ్రస్థాయిలో విమర్శిస్తున్నాయి. ఆయన వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం బాగోలేదని మండిపడుతున్నాయి. కమలహాసన్ నుంచి మొదలు పెడితే విశాల్ వరకు అందరు గవర్నర్ తీర్పట్ల మండిపడుతున్నారు. తమిళనాడు రాజకీయాలలో సస్పెన్స్ వీడటం లేదు.

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో అతిపెద్ద పార్టీగా అవతరించిన విజయ్ టీవీకే పార్టీకి.. ప్రభుత్వ ఏర్పాటు కోసం గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ అనుమతి ఇవ్వకపోవటంపై సర్వత్రా చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తమిళనాడు రాజకీయ పరిణామాలపై లోక్‌సత్తా వ్యవస్థాపకులు జయప్రకాష్ నారాయణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా తాజా రాజకీయ పరిణామాలు, తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాటుకు టీవీకే విజయ్‌ను గవర్నర్ అనుమతించకపోవటం అన్యాయమైన చర్యగా జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. గవర్నర్ తీరు అప్రజాస్వామికమే కాకుండా.. రాజ్యాంగ స్ఫూర్తికి, మౌలిక సూత్రాలకు పూర్తిగా విరుద్ధమని విమర్శించారు. ప్రభుత్వానికి శాసనసభ మద్దతు ఉందా, లేదా అనే విషయం తేల్చాల్సింది అసెంబ్లీలో కానీ.. రాజ్‌భవన్‌లో (లోక్ భవన్) కాదని జయప్రకాష్ నారాయణ్ అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని.. విజయ్‌ను ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించేలా గవర్నర్‌కు సూచించాలని అన్నారు. బలనిరూపణ ద్వారా శాసనసభలో ప్రభుత్వాన్ని ఓడించేంత వరకూ.. మైనారిటీ ప్రభుత్వమైనా పాలన సాగించవచ్చని జయప్రకాష్ నారాయణ్ పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు గతంలో ఎన్నో జరిగాయన్న జేపీ.. 1969లో కాంగ్రెస్ చీలిక తర్వాత ఇందిరా గాంధీ ప్రభుత్వం ఏర్పాటు, 1991 నుంచి 1996 వరకూ పీవీ నరసింహారావు పాలనను గుర్తు చేశారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి పక్షపాత రాజకీయాలు చేసే హక్కు గవర్నర్లకు లేదని జయప్రకాష్ నారాయణ్ స్పష్టం చేశారు. తమిళనాడులో ప్రస్తుతమున్న రాజకీయ సంస్కృతిని తిరస్కరిస్తూ తమిళ ప్రజలు అసాధారణమైన తీర్పును ఇచ్చారని.. గవర్నర్ ఆ తీర్పును అగౌరవపరచడం రాజకీయాలపై ప్రజల విశ్వాసాన్ని మరింత దెబ్బతీసి, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తుందని జయప్రకాష్ నారాయణ్ అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి చర్యలు.. వీధి పోరాటాలకు, ప్రభుత్వాల పతనానికి ఎలా దారితీస్తాయో పొరుగు దేశాలలో చూశామని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా వివేకం, ముందుచూపుతో వ్యవహరించి, తమిళనాడులో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అతిపెద్ద పార్టీగా నిలిచినవారిని ఆహ్వానించమని గవర్నర్‌కు సలహా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాజ్యాంగ విలువల పరిరక్షణకు రాష్ట్రపతి జోక్యం చేసుకోవాలని.. గవర్నర్ ఇంకా మొండిగా వ్యవహరిస్తే, అతడిని తక్షణమే తొలగించాలని సూచించారు. రాజేంద్ర 1989లో బిజెపిలో చేరారు. 2002, 2012లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2017లో స్పీకర్ గా దేశంలోనే మొట్టమొదటిసారిగా కాగిత రహిత అసెంబ్లీ ని రూపొందించారు. రాజ్యాంగ సూత్రాలను ఈయన నూటికి నూరుపాళ్ళు అమలు చేస్తారు. 2025 నుంచి కేరళ రాష్ట్రానికి గవర్నర్ గా ఉన్నారు. తమిళనాడు రాష్ట్రానికి ఇన్చార్జి గవర్నర్ గా వ్యవహరిస్తున్నారు.

## రూ.300 కోట్లు ఇస్తేనే కాంగ్రెస్‌లో ఉంటా..

ఈ రెండు డిమాండ్లు నెరవేరిస్తేనే.. తాను కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతానని ఆమె తేల్చి చెప్పేశారు. అయితే నిర్మలా సప్రే చేసిన ఈ సంచలన డిమాండ్లు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించాయి. దీంతో నిర్మలా సప్రే వ్యవహార శైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన హస్తం పార్టీ.. ఇది బహిరంగ రాజకీయ బేరసారాలుగా అభివర్ణించింది. ఇక కాంగ్రెస్ టికెట్‌పై ఎన్నికల్లో గెలిచిన నిర్మలా సప్రే.. ఎన్నికలు పూర్తి అయిన తర్వాత నుంచి ఆమె బీజేపీ కార్యక్రమాల్లో తరచూ కనిపిస్తుండటం.. తీవ్ర చర్చనీయాంశంగా మారుతోంది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌తో పాటు పలువురు బీజేపీ నేతలతోనూ నిర్మలా సప్రే.. వేదికలు పంచుకోవడం ఆ రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ క్రమంలోనే ఆమె త్వరలోనే బీజేపీ తీర్థం పుచ్చుకుంటారనే ప్రచారం జోరుగా సాగుతున్నాయి. అయితే ఆమె ఇప్పటి వరకు పార్టీ మార్పుపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. కానీ ఆమె వ్యవహార శైలి చూస్తుంటే మాత్రం కాంగ్రెస్‌ను వీడి బీజేపీలో చేరే సూచనలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. మరోవైపు.. కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే నిర్మలా సప్రేపై ఫిరాయింపుల నిరోధక చట్టం కింద చర్యలు తీసుకోవాలని కోరుతూ జబల్‌పూర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణల ప్రకారం.. తమ పార్టీ టికెట్‌పై గెలిచిన నిర్మలా సప్రే ఆ తర్వాత తమ పార్టీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని.. అదే సమయంలో బీజేపీకి మద్దతు ఇస్తున్నారని పేర్కొన్నారు. బీజేపీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో విచారణలో ఉంది. ఇక ఈ వ్యవహారంపై ఎక్స్ వేదికగా తీవ్రంగా స్పందించిన సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి పీసీ శర్మ.. నిర్మలా సప్రే వ్యాఖ్యలు రాజకీయ ఒత్తిడి, బేరసారాల్ని స్పష్టంగా చూపిస్తున్నాయని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తూ ప్రతిపక్ష ఎమ్మెల్యేలను ప్రభావితం చేసేందుకు బీజేపీ బహిరంగ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. అయితే.. నిర్మలా సప్రే వివాదంపై బీజేపీ ఇప్పటివరకు అధికారికంగా ఎక్కడా స్పందించలేదు. ఇక బీనా నియోజకవర్గాన్ని జిల్లాగా ప్రకటించాలని ఎప్పటి నుంచో అక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే నిర్మలా సప్రే చేస్తున్న వ్యాఖ్యలు నిజంగా అక్కడి ప్రజల కోసమా లేక ఆమె రాజకీయాల్లో భాగమా అనేది ఇప్పుడు మధ్యప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## రాయలసీమ ఇక రాయల్.. సీమ..

స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత వేగంగా అందాలంటే ఫైళ్ల క్లియరెన్స్‌లో జాప్యం ఉండకూడదని, ప్రతి ఫైల్‌ను 24 గంటల్లోపు పరిష్కరించేలా మంత్రులు, అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఈ ఫైళ్ల క్లియరెన్స్ సమయం రోజుల నుంచి గంటలకు తగ్గడంపై ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. గత మూడు నెలలతో పోలిస్తే ఫైళ్ల క్లియరెన్స్ సమయం సగటున 10 రోజుల నుంచి రెండు రోజులకు తగ్గిందని ఐటీ కార్యదర్శి వివరించారు. ఈ విషయంలో వేగంగా పనిచేస్తున్న మంత్రులు, కలెక్టర్లు, ఎస్పీలు, కార్యదర్శులను సీఎం అభినందించారు. పెద్దమొత్తంలో ఫైళ్లు వచ్చినా సరాసరి 10 గంటల వ్యవధిలోనే పరిష్కరించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్‌ను ప్రత్యేకంగా ప్రశంసించారు. అయితే, ఫైళ్ల క్లియరెన్స్‌లో వెనుకబడిన కొందరు కలెక్టర్లు, ఎస్పీలు, జాయింట్ కలెక్టర్లు తమ పనితీరును మెరుగుపరుచుకుని, వేగం పెంచాలని సూచించారు. ఇకపై మండల స్థాయి వరకు మాన్యువల్ ఫైళ్లు లేకుండా, కేవలం ఈ ఫైల్స్ మాత్రమే జనరేట్ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు టెక్నాలజీని విస్తృతంగా వినియోగించాలని సీఎం సూచించారు. ఇప్పటికే 'మనమిత్ర' ద్వారా 29 లక్షల మందికి వాట్సప్ గవర్నెన్స్‌పై శిక్షణ ఇచ్చామని, 90 శాతం సేవలు వాట్సప్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి అన్ని ప్రభుత్వ సేవలను వాట్సప్‌లో అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆన్‌లైన్ సేవల ద్వారా అవినీతి, దుర్వినియోగాన్ని అరికట్టవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వంలోని వివిధ శాఖలకు వేర్వేరు వెబ్‌సైట్లు, డ్యాష్‌బోర్డులు ఉండటం వల్ల సమన్వయం కష్టమవుతోందని, అన్ని శాఖల డేటాను ఇంటిగ్రేట్ చేసి 'డేటా లేక్' కిందకు తీసుకురావాలని సీఎం ఐటీ శాఖకు సూచించారు. దీనిపై స్పందించిన ఐటీ శాఖ మంత్రి లోకేశ్, అన్ని శాఖల పనితీరును తెలిపే కీలక సూచికలతో (KPIs) ఒకే డ్యాష్‌బోర్డును 90 రోజుల్లో అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. దీనివల్ల రోజువారీ లక్ష్యాలను పర్యవేక్షిస్తూ త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవడం సులభమవుతుందని వివరించారు. ఈ సమావేశంలో పలు ఇతర అంశాలపై కూడా సీఎం ఆదేశాలు జారీ చేశారు. తుపానులు, పిడుగుల వంటి ప్రకృతి వైపరీత్యాల హెచ్చరికలను నేరుగా ప్రజల మొబైళ్లకే పంపాలని, తీరప్రాంత జిల్లాల కలెక్టర్లు సీవీడ్ సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. పట్టణాభివృద్ధి సంస్థలు (యూడీఏ), మున్సిపాలిటీలు, సెమీ అర్బన్ ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాలని, వాటిని నివారించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

**ఆగస్టు 15న రెండున్నర లక్షల ఇళ్ల గృహప్రవేశాలు**

అమరావతి వేదికగా జరిగిన 7వ జిల్లా కలెక్టర్ల సదస్సు రెండో రోజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్ర సమగ్ర అభివృద్ధి, సంక్షేమంపై దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఇళ్ల నిర్మాణం, మౌలిక వసతులు, సామాజిక వర్గాల సాధికారతపై సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. 2027 నాటికి రాష్ట్రంలో పేదలందరికీ ఇళ్లు ఉండాలనే పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో గృహ నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను సీఎం ఆదేశించారు. వచ్చే ఆగస్టు 15 నాటికి 2.50 లక్షల ఇళ్లకు సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలని, డిసెంబర్ నాటికి మరో 2.38 లక్షల ఇళ్లను సిద్ధం చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. 2027 డిసెంబర్ నాటికి అదనంగా మరో 10 లక్షల ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ ధ్యేయమని స్పష్టం చేశారు. ఇందుకోసం సుమారు 2 లక్షల మందికి కొత్తగా ఇళ్ల స్థలాలు అవసరమవుతాయని, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు కేటాయించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు, కొండ ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్న పేదల ఇళ్లను క్రమబద్ధీకరించాలని ముఖ్యమంత్రి ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే ఒక్క విజయవాడలోనే 60 వేల మందికి, విశాఖపట్నంలో 30 వేల మందికి లబ్ధి చేకూరుతుందని ఆయన వివరించారు. ఈ విషయంలో ఏవైనా సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే, వాటిని వెంటనే క్యాబినెట్ ఆమోదానికి పంపాలని, సామాన్యుల ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తామని కలెక్టర్లకు భరోసా ఇచ్చారు. అలాగే గుంటూరులో పెండింగ్‌లో ఉన్న 22ఏ భూముల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. సామాజిక న్యాయం దిశగా సీఎం చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. బుడగ జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చడంపై కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తామని, అయితే కేంద్రం నుంచి అనుమతులు వచ్చేలోపు వారికి ఉద్యోగ మినహా ఎస్సీలకు అందే అన్ని ఇతర సంక్షేమ ఫలాలను వర్తింపజేయాలని ఆదేశించారు. బీసీల వెనుకబాటుతనంపై అధ్యయనం చేయడానికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేశామని, ఆ నివేదిక ఆధారంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు తగిన రిజర్వేషన్లు కల్పిస్తామని హామీ ఇచ్చారు. బీసీ హాస్టళ్ల రూపురేఖలు మార్చేలా ఆర్వో ప్లాంట్లు, సీసీ కెమెరాల ఏర్పాటుకు నిధులు కేటాయించినట్లు తెలిపారు. మైనారిటీల ఆర్థికాభివృద్ధికి సంబంధించి సీఎం సరికొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ ముస్లిం జనాభా ఉన్న ప్రాంతాల్లో రూరల్ ఆటోనగర్ లను ఏర్పాటు చేయాలని సూచించారు. వీటిని వక్ఫ్ బోర్డు భూముల్లో నిర్మించి, మైనారిటీ యువతకు లైవ్ లీ హుడ్ హబ్ లుగా మార్చడం ద్వారా పారిశ్రామికాభివృద్ధికి తోడ్పడాలని అధికారులను ఆదేశించారు. ముస్లిం మైనారిటీల నైపుణ్యాన్ని సద్వినియోగం చేసుకునేలా ఈ పారిశ్రామిక వాడలను తీర్చిదిద్దాలని కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. వేసవి దృష్ట్యా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా 'సమ్మర్ యాక్షన్ ప్లాన్'పై సీఎం సమీక్షించారు. జలధార, పశుగ్రాసం వంటి పథకాలను కేంద్ర ప్రభుత్వ పథకాలతో అనుసంధానం చేసి గరిష్ఠ ప్రయోజనం పొందాలని సూచించారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి, ప్రభుత్వ ప్రాధాన్యతలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, పరిపాలనలో పారదర్శకతను పాటిస్తూ నిర్ణీత గడువులోగా లక్ష్యాలను చేరుకోవాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

## యువకుడు దారుణహత్య

కుటుంబసభ్యుల హెచ్చరికలను లెక్కచేయకుండా యావన్ తరచూ సీతాఫల్‌మండి ఇందిరానగర్‌లోని తన ఫ్రెండ్స్ వద్దకు వస్తూ లవర్‌ను కలుస్తుండేవాడు. దీనిపై కక్ష పెంచుకున్న యువతి బంధువులు, అతడిని చంపేయాలని నిర్ణయానికి వచ్చారు. ఈ క్రమంలో గురువారం రాత్రి యావన్ తన స్నేహితుడి గదిలో టీవీ చూస్తుండగా, మూడు బైక్‌లపై వచ్చిన ఆరుగురు దుండగులు ఒక్కసారిగా కత్తులతో దాడికి పాల్పడ్డారు. ప్రాణాలు కాపాడుకోవడానికి యావన్ బయటకు పరుగెత్తినప్పటికీ, నిందితులు అతడ్ని వెంబడించి అంతా చూస్తుండగానే వీధిలోనే కత్తులతో విచక్షణారహితంగా పొడిచి చంపారు. గొంతులో కత్తి పోట్లు ఎక్కువగా ఉన్నాయి. తీవ్ర రక్తస్రావంతో యావన్ అక్కడికక్కడే మృతి చెందగా, స్థానికుల నుంచి సమాచారం అందుకున్న చిలకలగూడ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించగా, మృతదేహాన్ని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. చెట్టంత ఎదిగిన కొడుకు త్వరలో చేతికి అందొస్తాడని, మంచి జాబ్ చేసి తమను పోషిస్తాడని భావించామని.. కానీ వాడి ప్రాణాలు తీశారంటూ యావన్ తల్లిదండ్రులు ఆసుపత్రి వద్ద కన్నీళ్లు పెట్టుకున్నారు. పోలీసులు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో ఉన్నారు.

# డిప్యూటీ కమీషనర్ శైలజకు ఘనంగా సన్మానం

■ **సామాజిక కార్యకర్త డా లక్ష్మి వీరమల్లు**

**జయభేరి, మేడిపల్లి :**



ఎన్నో ఏళ్ల సుదదీర్ఘ మైన ప్రయాస బోడుప్పల్ లోని రా చెరువు పరిరక్షణ సమితి సభ్యులది. ప్రజలది. అనేక సమస్యలతో. విషతుల్యం అయిన చెరువు కోసం వివిధ నాయకులు. స్వచ్ఛంద సంస్థలు అనేక సమూహాలు మంత్రుల.ఏ మ్మెల్యే. ఎమ్మెల్సీ. ఎంపీ. జడ్పీటీసీ. ఎంపీపీ. మున్సిపల్ పాలక మండలి సభ్యులు.కమీషనర్ .కలెక్టర్. ఇరిగేషన్. పొల్యూష న్.. అయిలా కమీషనర్. మాజీ మేయర్. ముక్యంగా బోడుప్పల్ ముద్దు బిడ్డ తోటకూర వజ్రష్ యాదవ్ ప్రత్యేక కృషి అప్పటి కమీషనర్ ఇప్పటి డిప్యూటీ కమీషనర్ శైలజా ముందు చూపు ఆలోచన విధానం యువ నేత అజయ్ కుమార్ పట్టుదల తో నేడు రా చెరువు అత్యంత సుందరంగా మినీ ట్యాంక్ బండ్ గా రూపు దిద్దుకొనే సందర్భంగా నేడు డిప్యూటీ కమీషనర్ గారు మిగిలి పోయిన నాలా పనులు. వాసవి నగర్ చౌరస్తా నుండి గాయత్రి హిల్స్ రోడ్డు మారమ్మ త్తులు.. చూసి తక్షణమే అధికారుల కు ఫోన్ చేసి రిపేర్ త్వరగా చేయాలి అని ఆదేశాలు జారీ చేశారు. Ghmc అధికారులు కూడా పాల్గొని దోమల నివారణకు తక్షణ చర్యల గూర్చి వివరించారు మల్లయ్య నగర్ లోని కమ్యూనిటీ హాల్ గూర్చి కూడా అధికారుల ను వివరాలు అడిగి తక్షణమే మిగిలిన పనులు పూర్తి చేసే విదంగా చర్యలు తీసుకో వాలని చెప్పారు మల్లయ్య నగర్ ఇండ్ల యాజమాన్యం అందరూ సమిష్టి గా స్వంత నిధుల తో నిర్మించిన ఓపెన్ జిమ్ సందర్శించి ఆనందం వ్యక్తం చేసారు మల్లయ్య నగర్ కమిటీని అభినందిం చారు. అక్కడి నుండి రా చెరువు పరిరక్షణ సమితి సభ్యుల విజ్ఞప్తి మేరకు రా చెరువు కూడా సందర్శించి అక్కడ జరిగే పనుల వివరాలు తెలుకున్నారు సభ్యులు చెరువు చుట్టూ కూడా వాకింక్ ట్రాక్ ఏర్పాటు చేస్తే అందరికి ఉపయోగం ఉంటుంది అని ఆరోగ్యం కోసం వాకింగ్ చాలా అవసరం ఉంది అని వివరించారు అలాగే కట్ట కింద రోడ్డు లేక నచారం కంపెనీ లలో పనులు చేసే మహిళ లు చుట్టూ తిరిగి ఆర్థికంగా నష్టపోతున్నారు అని వివారించగ వెంటనే అధికారులు. కాంట్రాక్ట్ గారికి సమాచారం ఇచ్చి మట్టి రోడ్డు సత్వరం చేయాలి అని పనులు అప్పగించారు ఈ సందర్భంగా రా చెరువు పరిరక్షణ సమితి సభ్యులు. వివిధ కాలనీ ల అధ్యక్షులు. ప్రజలు డిప్యూటీ కమీషనర్ గారికి కృతజ్ఞత తెలుపుతూ ఘనంగా సన్మా నించుకున్నారు ఈ సందర్భంగా రా చెరువు పరిరక్షణ సమితి సభ్యులు సామాజిక కార్యకర్త డా లక్ష్మి వీర మల్లు మాట్లాడు తు రా చెరువు పరిసర ప్రాంతం పై మీరు ప్రత్యేక ధ్రుష్టి పెట్టి మాకు చాలా న్యాయం చేశారు అని కృతజ్ఞతలు తెలుపుతూ లెటర్ ఇచ్చారు.మిగతా పనులు త్వరగా చేసే విదంగా కృషి చేయాలనీ కోరారు ఈ సందర్భంగా k. చెంద్ర శేఖర్. నాగభూశనం. సంతోష్. రూపేష్. మోహన్. కోటేశ్వర్.సత్యనారాయణ కిరణ్.రవీందర్ రెడ్డి. నాగరాజు.. రామ్ కుమార్. శరత్ మొదలైన అనేక మంది కాలనీ కుటుంబ సభ్యులు మున్సిపల్ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.సభ్యులు అందరికి Honestly ధన్యావాదములు తెలిపారు.



## బిజెపి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ గ్రాండ్ సక్సెస్

**జయభేరి, తుర్కపల్లి, మే 08 :**

తుర్కపల్లి మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాయ దశరథ హాజరై మాట్లాడుతూ ఈనెల 10వ తేదీన నరేంద్ర మోడీ బహిరంగ సభ సికింద్రాబాద్ పెరేడ్ గ్రామంలో ఘనంగా జరుగుతుందని అన్నారు. మోడీ మూడవసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తెలంగాణలో అడుగుపెట్టిన చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొక్కొండ లక్ష్మి నారాయణ గౌడ్, రాష్ట్ర మైనార్టీ మోర్చా కార్యవర్గ సభ్యులు చాంద్ పాషా సీనియర్ యాట పెంటయ్య, కందుకూరి చల్మయ్య, భానోత్ శత్రు నాయక్, దానబోయిన సత్యనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆకుల రమేష్, జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి బొల్లూ నర్సింహ యాదవ్, జిల్లా గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి మలోత్ రమేష్ నాయక్, మండల ప్రధాన కార్యదర్శి భినారం కనకయ్య, యువ మోర్చా జిల్లా కార్యదర్శి మేకల పాండు యాదవ్, మోత్కుపల్లి బిక్షపతి, చిలుకూరి రమేష్, నరేష్ నాయక్, కనుగంటి భాను యాదవ్, రాజేందర్ నాయక్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం సహకారంతో మైక్ సెట్ బహుకరణ



**జయభేరి, తుర్కపల్లి, మే 08 :**

తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామంలోని హనుమాన్ దేవాలయానికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మైక్ సెట్ ను బహూకరించారు .ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బొత్త రాములు మాట్లాడుతూ గ్రామ దేవాలయానికి దాతలు 1 ఆమ్ప్లి ఫైర్, 5 మైకులు అందజేయడం అభినందనీయమని అన్నారు. గ్రామ అభివృద్ధికి దాతల సహకారం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో గట్టు పరమేశ్వర్, జూలకంటి కృష్ణమూర్తి ,జూలకంటి రమేష్, గట్టు విజయ్, నంగునూరు రాజు, గట్టు చంద్రం, జూలకంటి భాస్కర్, వలబోజు ఆంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## విద్య, వైద్యానికి సిఎస్ఆర్ నిధులు



**జయభేరి, తుర్కపల్లి, మే 08 :**

గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో సిఎస్ఆర్ నిధులు ఎంతో ఉపయోగపడతాయని సర్పంచ్ బొత్త రాములు అన్నారు. తుర్కపల్లి మండలం గంధ మల్ల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధికి కెనరా బ్యాంకు వారు తమ సి ఎస్ ఆర్ నిధులలో భాగంగా 10 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ నిధులతో పాఠశాలలో ఆధునిక సదుపాయాలతో కూడిన సైన్స్ ల్యాబ్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని శుక్రవారం సైన్స్ లాబ్ భవనానికి స్లాబు వేయడం జరిగిందని అన్నారు. సైన్స్ ల్యాబ్ నిర్మాణం పూర్తయిన అనంతరం విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడంతోపాటు ప్రాక్టికల్స్ విద్యాభ్యాసానికి ఎంతో దోహదపడుతుందని అన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన కెనరా బ్యాంకు పాఠశాల సిబ్బందికి గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్కు సుజాత, జూపల్లి తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉచిత పశు ఆరోగ్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**జయభేరి, తుర్కపల్లి, మే 08 :**

తుర్కపల్లి మండలం పల్లె పహాడ్ గ్రామంలో ప్రజా పాలన ,ప్రగతి ప్రణాళికలో భాగంగా శుక్రవారం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ పాంగల పవనిత బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామారావు మాట్లాడుతూ పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, దూడలకు నట్టల నివారణ మందులు, మేలు జాతి దూడల ప్రదర్శన, సబ్సిడీపై సీడ్ ను అందజేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది ఎల్ఎస్ఎ శేఖర్, వెటర్నరీ అసిస్టెంట్లు రాఘవేంద్ర ,శంషొద్దీన్, గోపాలమిత్రలు వీరు, బాలేష్, హర్ష, మహేష్, రైతులు పాల్గొన్నారు.



## గుర్తుతెలియని మృతదేహం

మేడిపల్లి టిఆర్ఎస్ పా ర్టీ ఆఫీస్ ఎదురుగా మెయిన్ రోడ్డులో నవాజ్ మెషిన్ టూల్స్ హార్డ్వేర్ షాప్ ముందు ప్రాంతంలో ఒక గుర్తుతెలియని మృతదేహం కనుగొనబడినది. మృతుడు వివరాలు క్రింది విధంగా ఉన్నాయి. వయస్సు సుమారు 50 సంవత్సరాలు, పురుషుడు, ఎత్తు సుమారు 5.5అడుగులు, దుస్తులు : Blue Shirt, Olive Green Short. గుర్తింపు లక్షణాలు : బక్క పల్చని వ్యక్తి నలుపు రంగులో నార్మల్ కలర్ లో ఉన్నాడు. పై వ్యక్తి గురించి ఎవరైనా సమాచారం తెలిసిన వారు లేదా వారి కుటుంబ సభ్యులు ఉంటే, దయచేసి మేడిపల్లి పోలీస్ స్టేషన్‌ను ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు 8712662172, 8712662702, 8712662704.

## అదృశ్యమైన మహిళ



**జయభేరి, హయత్‌నగర్, మే 8:**

ఫిర్యాదుదారుడు బట్టపోతు సాయి కిరణ్ (30), వృత్తి ఆటో డ్రైవర్, నివాసం బోడుప్పల్, మేడ్చల్‌మల్కాజిగిరి, తన భార్య అమల (31) కనిపించకుండా పోయినట్లు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రకారం, అమలతో సుమారు రెండు నెలల క్రితం వివాహం జరిగినది. తేదీ 07.05.2026 న ఉదయం సుమారు 07:00 గంటల సమయంలో భార్యాభర్తల మధ్య స్వల్ప గొడవ జరగడంతో, ఫిర్యాదుదారుడు తన భార్యను హయత్‌నగర్ టీనగర్ కాలనీలో నివసిస్తున్న తన అన్న సురేష్ ఇంటికి తీసుకెళ్లినాడు. అక్కడ మాట్లాడుకుంటున్న సమయంలో మధ్యాహ్నం సుమారు 01:00 గంటలకు అమల కోపంతో ఇంటి నుండి బయటకు వెళ్లినారు. కొద్దిసేపటికి తిరిగి వస్తారని భావించినప్పటికీ, ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు బయట వెతికినప్పటికీ ఆమె ఆచూకీ లభించలేదు. అదృశ్యమైన సమయంలో ఆమె గ్రే రంగు చీర మరియు బ్లౌజ్ ధరించి ఉన్నట్లు తెలిపారు.ఈ మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్ లేదా హయత్‌నగర్ పోలీసులకు సమాచారం అందించాలని కోరడమైనది.

## పాఠశాలలో చోరీ

హయత్నగర్ కోహెడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోరీ జరిగిన ఘటనకు సంబంధించి కేసు నమోదు చేయబడినది. ఈ మేరకు పాఠశాల హెడ్‌మాస్టర్ ఎన్. తిరుపతిబాయి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రకారం, రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు పాఠశాల ఆవరణలోకి అక్రమంగా ప్రవేశించి కిచెన్ షెడ్, తరగతి గదులు, స్టోర్ రూమ్, కంప్యూటర్ ల్యాబ్ తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. కిచెన్ స్టోర్ రూమ్ నుండి ఒక 10 కిలోల కుక్కర్, ఒక 3 కిలోల రైస్ బౌల్, ఒక 5 కిలోల రైస్ బౌల్, వాటి మూతలను అపహరించినట్లు తెలిపారు. అదేవిధంగా కంప్యూటర్ ల్యాబ్‌లో ఉన్న 6 ఎక్సైడ్ బ్యాటరీలను కూడా దొంగిలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్ టీమ్ కూడా సంఘటనా స్థలాన్ని సందర్శించి ఆధారాలను సేకరించినది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా "దిశ" సమావేశం

■ **ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**జయభేరి, మేడ్చల్ :**




మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ ఆఫీస్ లో మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ అధ్యక్షతన నిర్వహించిన "దిశా" సమావేశంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా అభివృద్ధి, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు, ప్రజలకు అందుతున్న సేవలపై సమగ్రంగా చర్చ జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ, జిల్లాలో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగాలని అధికారులకు సూచించారు.

ముఖ్యంగా రహదారులు, తాగునీరు, డ్రైనేజీ, విద్యా మరియు ఆరోగ్య రంగాల్లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. ప్రజలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలని అన్నారు. అలాగే, పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.

జిల్లా అభివృద్ధి కోసం సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజ్ గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దివంగత మహానేత బండారి రాజిరెడ్డి ఆశయ సాధనకు కృషి చేస్తా

■ **ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**జయభేరి, ఉప్పల్ :**




దివంగత ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బండారి రాజిరెడ్డి ప్రధమ వర్ధంతి సందర్భంగా ఈసిల్ రాధిక చౌరస్తా వద్ద ఘనంగా నివాళి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, రాజిరెడ్డి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బండారి రాజిరెడ్డి ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేసిన మహానేత అని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఆయన తన రాజకీయ జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. ఎప్పుడూ ప్రజల మధ్య ఉండి వారి కష్టసుఖాల్లో భాగస్వామ్యం అవుతూ, అందరికీ అందుబాటులో ఉండే ప్రజానాయకుడిగా ఆయన గుర్తింపు పొందారని తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధి దిశగా ఆయన చేసిన కృషి అపారమని, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రాంతానికి మంచి పేరు తెచ్చారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఆయన చూపిన మార్గంలోనే ముందుకు సాగుతూ ప్రజలకు మరింత సేవ చేయడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శిరీష సోమ శేఖర్ రెడ్డి గారు, కొత్త రామారావు BRS పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, బండారి నీలం రెడ్డి BRS పార్టీ నాయకులు మహిపాల్ రెడ్డి ,లక్ష్మి నారాయణ పటేల్ ,మనెమ్మ ,కుమార స్వామి, రహీం శిరీష రెడ్డి BRS పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఏ అధికారంతోని భూమి పూజా చేద్దామనుకున్నారు..??

■ **ప్రోటోకాల్ గురించి మీకు తెలియదా.?**

■ **ఉప్పల్ ఎమ్మెల్యేను నిలదీసిన హైడ్రా కమిషనర్**

■ **కాప్రా కాంగ్రెస్ నేతల ఫిర్యాదుపై స్పందించిన కమిషనర్**

**జయభేరి, కాప్రా :**




ఏ అధికారంతోని కాప్రా చెరువులో భూమి పూజా చేద్దామనుకున్నారు..?? ప్రోటోకాల్ గురించి మీకు తెలియదా.? అంటూ ఉప్పల్ ఎమ్మెల్యేపై హైడ్రా కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల విషయంలో మంత్రులు, జిల్లా మంత్రులు ఉంటారని మీకు తెలుసు కదా. వారిని ఎవరినీ కూడా కాదని మీరే ఎలా భూమి పూజా చేద్దామనుకున్నారంటూ ఎమ్మెల్యేను హైడ్రా కమిషనర్ నిలదీశారు. కాప్రా చెరువు అభివృద్ధికి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ మందుముల పరమేశ్వర్‌రెడ్డి రూ.35 కోట్ల నిధులను మంజూరు చేయించారు. త్వరలోనే జిల్లా ఇంఛార్జీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా భూమి పూజ చేసి పనులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి చెరువులో అభివృద్ధి పనులకు తానే భూమి పూజ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న కాప్రా కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి ఇదే విషయం చెప్పారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని వెంటనే ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి ఫోన్ చేసి పై విధంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రోటోకాల్ ప్రకారమే భూమిపూజ జరుగుతుందని కాప్రా కాంగ్రెస్ నేతలకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాప్రా డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు కొబ్బనూరి నాగశేషు గారు, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విఠల్ నాయక్, మాజీ కౌన్సిలర్ రాజేందర్ గారు, జిల్లా మాజీ ఏ ఎం సి కొబ్బనూరి నాగరాజు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పడమటి మల్లారెడ్డి, పొట్టు బాబురావు, జి సత్యనారాయణ, తన్నీరు శ్రీహరి, తోటకూర శ్రీకాంత్, గుణశేఖర్, రాజశీలన్... తదితరులు పాల్గొన్నారు

# ఎండోమెంట్ చేరిన దుకాణాల లొల్లి

- ఎండోమెంట్ ఆఫీస్ ముందు యాదాద్రి పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా
- వర్తక సంఘం రద్దుచేసి స్థానిక ఉద్యోగులకు చెందేలా టెండర్ వేయాలని డిమాండ్
- ఎండోమెంట్ అదనపు కమిషనర్లకు వినతుల సమర్పణ




**జయభేరి, హైదరాబాద్, మే 08 :**

యాదగిరి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కొలువైన యాదగిరి కొండపైన దుకాణాల వివాదం కాస్త చిలికి చిలికి గాలి వానగా మారింది. 60 సంవత్సరాలుగా పేద, మధ్య తరగతికి చెందిన 114 దుకాణాల ద్వారా వందలాది మంది జీవనోపాధి పొందుతున్నామని, మానవతా దృష్టితో తన షాపులను రెన్యువల్ చేసి ఆదుకోవాలని కొండపైన వర్తక సంఘం ఇటీవలనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కాగా ఇది ఎండోమెంట్ విరుద్ధమని తక్షణమే వర్తక సంఘాన్ని రద్దుచేసి వేలం వేయాలని,స్థానిక నిరుద్యోగ యువతకు జీవనోపాధి కల్పించాలని యాదాద్రి పరిరక్షణ కమిటీ డిమాండ్ చేస్తోంది.

**ఎండోమెంట్ కార్యాలయం ముందు ధర్నా**

యాదాద్రి పరిరక్షణ కమిటీ అధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ లోని దేవాదాయ,ధర్మాదాయ శాఖ కార్యాలయం ముందు యాదగిరిగుట్ట కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేస్తూ స్థానిక నిరుద్యోగులకు చెందేలా టెండర్ వేయాలని ప్రకార్డులతో ధర్నా నిర్వహించి అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్ రావు ,రెవెన్యూ,ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ ని కలిసి వినతి పత్రం సమర్పించారు.

**యాదాద్రి పరిరక్షణ కమిటీ వాదన**

ఈ సందర్భంగా పరిరక్షణ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా అతి తక్కువ కిరాయితో కొండపైన దుకాణాలు నిర్వహిస్తూ వాటిని రెన్యువల్ చేసుకుంటూ కొత్తవారికి అవకాశం ఇవ్వకుండా అధిక రేట్లకు అమ్ముతూ భక్తులను ఇబ్బంది పెడుతున్న వర్తక సంఘాన్ని తక్షణమే రద్దు చేస్తూ టెండర్లు వేయాలని డిమాండ్ చేస్తున్నాము. గతంలో కేవలం 30,40 షాపులే ఉండేవి ఇప్పుడు వాటిని 114 షాపులుగా పెంచారు. రాజీకీయ, అధికార బలం తోటి ఇష్టం వచ్చిన విధంగా ఈ షాపులను కేటాయిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాటబత్తిని ఆంజనేయులు,బంద రామస్వామి, దేవపూజ అశోక్, పల్లవు బాలయ్య, దండబోయిన వీరేష్, పబ్బాల ఉప్పలయ్య, మిరియాల కృష్ణ, ఆకుల అనిల్, బండి అనిల్, వంగపల్లి అరుణ్, మందోజు నరేష్, కొన్నె సంజీవ, కర్రె ప్రవీణ్, దార నవీన్, గోపగాని ప్రసాద్, జోరిగళ్ల ప్రశాంత్, కర్రే శ్యామ్, గుండు కుమార్, ఆరె కుమార్, దార క్రిష్ణ,పల్లపు రాజు, శ్రీనాధ్, వంశీ, రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.




## కల్యాణకట్టలో ఎస్పీఎఫ్ స్వచ్ఛ భారత్

**జయభేరి, యాదగిరిగుట్ట, మే 08 :**

టీజీ ఎస్పీఎఫ్ డీజీ స్వాతి లాక్రా ఆదేశాల మేరకు యాదగిరిగుట్ట ఆలయ భద్రతా విభాగం సిబ్బంది శుక్రవారం తులసి కాటేజ్ నుండి మల్లాపురం వరకు 10 కిలోమీటర్ల పరుగు నిర్వహించారు. అనంతరం కొండ కింద ఉన్న కల్యాణకట్ట వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆలయ ఈవో భవాని శంకర్ పాల్గొనగా, ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాలుపంచుకున్నారు. భక్తులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఎస్ పి ఎఫ్ ఇన్స్పెక్టర్ కె. శేషగిరి రావు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా సేకరించిన చెత్తను ట్రాక్టర్ ద్వారా సురక్షితంగా తరలించారు. ఈ సేవలో ఎస్ఐ రవి, ఏఎస్ఐలు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా గొంగిడి మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు




**జయభేరి, యాదగిరిగుట్ట, మే 08 :**

బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు శుక్రవారం యాదగిరిగుట్టలో ఘనంగా నిర్వహించారు.

**శ్రీ లక్ష్మి నరసింహుని పాదాల చెంత..**

యాదగిరిగుట్టలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి పాదాలు వైకుంఠ ద్వారం వద్ద కర్రె వెంకటయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఆనందోత్సాహాల మధ్య బాణా సంచా కాల్చారు. ఈ వేడుకల్లో మిట్ట వెంకటయ్య,కసావు శ్రీనివాస్, గౌడ శ్రీశైలం, మాటూరి బాలయ్య, ముఖ్యర్ల సతీష్ యాదవ్, రాజేష్, లింగం, క్రాంతి, శేఖర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలో ఉచిత వైద్య శిబిరం



**జయభేరి, యాదగిరిగుట్ట, మే 08 :**

యాదగిరిగుట్ట మండలంలోని గౌరాయపల్లి గ్రామంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చేనేత కార్మికుల ఆరోగ్య భద్రత,టీబీ ముక్తా భారత్ అభియాన్ ఫేస్ 2.0 కింద ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గౌరాయపల్లి గ్రామ సర్పంచ్ కేశిరెడ్డి శోభారాణి, ఉపసర్పంచ్ బింగి లక్ష్మీపతి ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఉచిత వైద్య శిబిరంలో మొత్తం 157 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఈపీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ వంశీకృష్ణ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పావని,గౌరాయపల్లి ఏఏఎం సెంటర్ డాక్టర్ శ్రవణ్‌తో పాటు వైద్యులు డాక్టర్.రమేష్,డాక్టర్.సోనాలి, డాక్టర్.కీరణ్మయి,నటేష్, మానస,జ్యోతి,సూపర్‌వైజర్ కె.హేమలత,శ్రీధర్ రెడ్డి,ల్యాబ్ టెక్నీషియన్,వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## దంతాలపల్లి లో తలసేమియా అవగాహన ర్యాలీ

- వైద్యాధికారి డాక్టర్ కవిత



**జయభేరి, దంతాలపల్లి, మే 08:**

అంతర్జాతీయ తలసీమియా దినమును పురస్కరించుకొని శుక్రవారం దంతాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి, సిబ్బందితో పి హెచ్ సీ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు తల సేమియా అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ కవిత మాట్లాడుతూ తలసీమియా రహిత భారతదేశం కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని ప్రతిజ్ఞ చేయించారు. చూడలేని దానికి మద్దతు ఇవ్వడం ముఖ్యం అన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి తల సేమియా బాధితులకు రక్షణగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆరోగ్య సిబ్బందికి మరియు ఆశా కార్యకర్తలకి గర్భిణీ స్త్రీలకి రక్త నమూనా పరీక్షలు చేయించి వ్యాధిని ముందస్తుగా గుర్తించాలని , పుట్టబోయే పిల్లలకు ఈ వ్యాధి రాకుండా కాపాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్, నర్సింగ్ ఆఫీసర్స్, పిడిఎమ్ఓస్, హెల్త్ అసిస్టెంట్ , ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా మంత్రి పొన్నం జన్మదిన వేడుకలు

- హోం ఫర్ ది డిసేబుల్డ్ లో వేడుకలు నిర్వహించిన - జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి



**జయభేరి, శామీర్ పేట్, మే 8 :**

రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ జన్మదిన వేడుకలను మూడు చింతల పల్లి మున్సిపాలిటీ పరిధిలోని జగన్ గూడ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. జగన్ గూడ పరిధిలోని హోం ఫర్ ద డిసేబుల్డ్ లో జిల్లా ఆర్టీఏ సభ్యులు భీమిడి జైపాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు మూడు చింతల పల్లి మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దోసకాయల వెంకటేశ్ మరియు పలువురు కాంగ్రెస్ నేతలు హాజరై అక్కడి చిన్నారులు మరియు దివ్యాంగుల మధ్య కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. అనంతరం సుమారుగా 300 మందికి పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ ఎన్ఎస్‌యూఐ నుండి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడిగా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పార్లమెంట్‌లో బలమైన స్వరాన్ని వినిపించారని కొనియాడారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి ప్రజల మనసుల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న ఉద్యమనేతగా నిలిచారని పేర్కొన్నారు. ప్రజాహితం కోసం నిరంతరం కృషి చేస్తూ, హుస్నాబాద్ నియోజక వర్గంతో పాటు హైదరాబాద్ జిల్లా మరియు రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న ఆయన నాయకత్వం మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. మంత్రి భవిష్యత్తులో మరెన్నో జన్మదినాలను జరుపుకుని ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అదేవిదంగా ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి విష్ణు, జిల్లా మహిళ కాంగ్రెస్ కార్యదర్శి లత, కౌన్సిలర్ మల్లేష్ యాదవ్, మాజీ సర్పంచ్ రాంచందర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బస్వారెడ్డి, దామోదర్ రెడ్డి, వెంకట రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, ప్రభాకర్ రెడ్డి, భూపాల్, రాజిరెడ్డి, మహేష్, బన్నీ తదితరులు పాల్గొన్నారు.

# బదిలీపై వెళ్తున్న LIC మేనేజర్‌కు ఘనసత్కారం

**జయభేరి, దేవరకొండ :**




బదిలీపై వెళుతున్న భారతీయ జీవిత బీమా సంస్థ దేవరకొండ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్ రాము చౌహన్ ని శుక్రవారం అభినందన వీడ్కోలు సభలో పాలసీదారులు ఖాతాదారులు,ఎల్ ఐ సి సిబ్బంది మిత్రులు ఘనంగా సన్మానించారు.2024 మే లో దేవరకొండ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ గా బాధ్యతలు చేపట్టిన రాము చౌహన్ గత 37 సంవత్సరాలుగా పాలసీదారులకు విశిష్టమైన సేవలు అందిస్తూ స్టెనోగ్రాఫర్ నుండి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ గా ఏదిగి అందరి మన్ననలు పొందారు. ఈ సందర్భంగా మలక్పేట బ్రాంచ్ హైదరాబాద్ 9 కు బదిలీపై వెళ్తున్న సీనియర్ బ్రాంచ్ మేనేజర్ ఎస్ రాము చౌహన్ మాట్లాడుతూ , ఉద్యోగస్తులకు బదిలీలు సర్వసాధారణమని, పనిచేసిన చోట గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. తాను ఎక్కడ పని చేసిన తనతో పాటు ఏజెంట్ మిత్రులు, సిబ్బంది కూడా ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మన స్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ 37 సంవత్సరాలనుండి సంవత్సరాలుగా ఎల్ఐసి లో విశిష్ట సేవలు చేస్తూ, స్టెనోగ్రాఫర్ నుండి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ స్థాయికి ఎదిగిన మీ జీవన ప్రయాణం ఎందరికో స్ఫూర్తి దాయకమని,వివిధ ప్రాంతాలలో మీ నాయకత్వం ఎందరికో ఆదర్శప్రాయని తెలిపారు. మీరు ఇలాగే మీ కొత్త బాధ్యతల్లో గొప్ప విజయాలు ఆనందం కలుగాలని మరెన్నో గొప్ప మైలురాళ్ళను దాటుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకుంటూ మీరు మీ కుటుంబ సభ్యులతో మీ జీవితంలో సుఖ సంతోషాలతో ఆయురారోగ్యలు అష్ట ఐశ్వర్యలతో తులతూగుతూ హద్దులు లేని ఆనందాలతో విశేషమైన సమాజసేవలలో కలకాలం గడపాలని, మలక్పేట్ బ్రాంచ్ హైద్రాబాద్ 9 సీనియర్ బ్రాంచ్ మేనేజర్ గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా వారికి హార్దిక శుభాకాంక్షలు తెలియజేసినారు.

# ప్రజా సమస్యలపై అధికారులు జవాబుదారీగా ఉండాలి

**జయభేరి, మేడ్చల్ జిల్లా :**




కేంద్ర ప్రభుత్వం నుంచి అమలయ్యే పథకాలు పై మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టరేట్ లో జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ ఆధ్వర్యంలో దిశ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సమీక్ష సమావేశానికి మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్(MMC) కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి తోపాటు మేడ్చల్ జిల్లలోని మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి, మల్కాజ్గిరి శాసనసభ్యులు మర్రి రాజశేఖర్ రెడ్డి, ఉప్పల్ శాసనసభ్యులు బండారు లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరించేలా కృషి చేయాలని, ప్రజా సమస్యలపై అధికారులు జవాబుదారీగా ఉండాలని సూచించారు. కేంద్రం నుండి మంజూరైన అభివృద్ధి నిధులు సకాలంలో పనులకు ఉపయోగించాలని, పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని దిశ వేదికగా అధికారులను ఆదేశించారు. అనంతరం మల్కాజ్గిరి పార్లమెంట్ పరిధిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను స్థానికతను గుర్తించి అర్హులైన పేదలకు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ఇతర ప్రాంతాల వారికి కూడా కేటాయించారని, ప్రస్తుత ప్రభుత్వం స్థానికులకు పది నుంచి పదిహేను శాతం కేటాయిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం స్థానికంగా ఉండే పేదలకు ఇళ్లను కేటాయించాలని సూచించారు. పేద ప్రజల కోసం ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేస్తే.. తెలంగాణలో సక్రమంగా అమలు కావడం లేదని తెలిపారు. విద్య, వైద్యం, ఉపాధి, విద్యుత్ వంటి వివిధ విభాగాలపై చర్చించి సమస్యలు పరిష్కరించాలని దిశ వేదికగా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.




## వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే

**జయభేరి, దేవరకద్ర :**

జడ్చర్ల పట్టణంలో వెల్కిచర్ల గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడి కుమారుడి వివాహ వేడుకకు శుక్రవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు. అలాగే భూత్పూర్ మున్సిపాలిటీ అమిస్తాపూర్ లో మందాడి అంజమ్మ ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమాన్ని కూడా ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ ఇంటి యజమానులకు శుభాకాంక్షలు తెలిపి తమ కుటుంబం తరపున నూతన వస్త్రాలను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే జిఎంఆర్ సతీమణి



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం పరిధిలో శుక్రవారం పలు వివాహ శుభ కార్యాలకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) సతీమణి కవిత మనసూదన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆమె ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పశువుల వ్యాధుల చికిత్స కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్




**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని భూత్పూర్ మండలం తాటికొండలో శుక్రవారం వెటర్నటి పశువుల గర్భకోశ వ్యాధులకు చికిత్స కేంద్రాన్ని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) ప్రారంభించారు. ఈ కేంద్రంలో పశువుల గర్భకోశ వ్యాధులకు సంబంధించి చికిత్సలు అందజేస్తారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణకు జలద్రోహం చేస్తున్న కాంగ్రెస్ ను
# కిలోమీటర్ లోతున బొంద పెడుతం

- తెలంగాణ వచ్చిన తర్వాత కూడా మన నీళ్లు దక్కలే
- సమైక్య రాష్ట్రంలో ఆంధ్రోళ్లను నిందించినం.. మన పార్టీ
- మేం అధికారంలోకి వచ్చాక వాటర్ కమిషన్ ఏర్పాటు చేస్తాం
- సాగు యోగ్యమైన ప్రతి గుంట భూమికి ప్రాజెక్టుల నుంచి నీళ్లు ఇస్తాం
- నీళ్ల విషయంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ చేసిన ద్రోహానికి ప్రజలు వాళ్లను క్షమించరు
- తెలంగాణకు నీటి విషయంలో జరిగిన అన్యాయాన్ని సరిచేసేందుకే తెలంగాణ రక్షణ సేన పుట్టింది
- పాలమూరు-రంగారెడ్డికి కేంద్రం జాతీయ హోదా ఇవ్వాలి




**జయభేరి, చౌదరిగూడెం - షాద్ నగర్ :**

తెలంగాణ రక్షణ సేన ఏర్పడిన తర్వాత మొదటి సారిగా మహబూబ్ నగర్ జిల్లాలో సభ పెట్టుకోవటం సంతోషం. నేను జోగులాంబ అమ్మవారి భక్తురాలిని. మొదటి మీటింగ్ ఇక్కడే పెడతామని గతంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం. తెలంగాణ ప్రయోజనాల కోసం ఎవరు పిడికిలి బిగించిన సరే ప్రజలు మద్దతిచ్చి వారిని గెలిపించారు. ఆ పోరాటాల ద్వారా తెలంగాణ రాష్ట్రంలో కూడా చాలా మార్పులు వచ్చాయి. అలాగే తెలంగాణ రక్షణ సేన నుంచి నీటి ఉద్యమాన్ని చేపడుతున్నాం. తెలంగాణ చరిత్రలో ఇది రాసిపెట్టుకోవాల్సిన రోజు. నీళ్ల కోసమే మనం తెలంగాణ పోరాటం చేసిన సంగతి మీ అందరికీ తెలిసిందే. పల్లె పల్లెన పల్లెరు కాయలు మొలిసినయంటూ గతంలో మనం ఆవేదన చెందాం. మహబూబ్ నగర్ జిల్లా నుంచి కృష్ణానది 3 వందల కిలోమీటర్లు పారుతున్న సరే మనకు నీళ్లు రాని పరిస్థితి. బీర బీర కృష్ణమ్మ నీళ్లన్నీ కూడా ఆంధ్రాకే వెళ్లిపోయాయి. తెలంగాణ తెచ్చుకున్నాక 12 ఏళ్లలో ఒక్కటంటే ఒక్క ఎకరాకు కూడా నీళ్లు రాలేదు. బీమా, నెట్టంపాడు, కోయిల ప్రాజెక్ట్ లను కూడా మనం పూర్తి చేసుకోలేదు. పాలమూరుకు కృష్ణానది నుంచి రావాల్సిన నీళ్లు రాలేదు.

బీఆర్ఎస్ పదేళ్లు, కాంగ్రెస్ వచ్చి రెండున్నరేళ్లు గడిచినా కృష్ణా నీళ్లు మనకు రాలేదు. పాలమూరురంగారెడ్డి కోసం 33 వేల కోట్లు ఖర్చు చేసి 33 ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదు. ఆంధ్రావాళ్లు ఉన్నప్పుడు మనకు నీళ్లు రాకుండా చేస్తున్నారని మనం తిట్టుకున్నాం. కానీ అవసరానికి ఆంధ్రావాళ్లను తిట్టి అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ కూడా మనకు చుక్క నీళ్లు తేలేదు. పాలమూరు అంటే మేధావులు, కళాకారులు ఉంటారు. మీరంతా ఒక్కసారి ఆలోచించాలి. మన పాలకులే మనల్ని మోసం చేశారు. ఇది నిజమా అంటే అక్షరాల నిజం. ఉమ్మడి రాష్ట్రం ఉన్నప్పుడే కిరణ్ కుమార్ రెడ్డి జురాల నుంచి నీళ్లు తీసుకునేందుకు జీవో 72 తెచ్చారు. కానీ బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బేషజాలకు పోయింది. జురాల సోర్స్ పాయింట్ ను శ్రీశైలంకు మార్చింది. బీఆర్ఎస్ పార్టీ చేసింది క్షమించరాని నేరం. ఆ తర్వాత నీళ్లు తీసుకునే ఎత్తును కూడా పెంచారు. బీఆర్ఎస్ లో ఉన్న ఒక గుంటనక్క కాంట్రాక్టర్ తో కుమ్మక్కై నీళ్లు తీసుకునే ఎత్తును పెంచారు. అప్రోచ్ ఛానెల్ 140 మీటర్లు ఉండాల్సింది. కానీ దాన్ని 50 మీటర్లకు కుదించారు. రిజర్వాయర్లు కట్టారు. కానీ అవసరమైనే చిన్న కాలువలు మాత్రం కట్టలేదు. శ్రీశైలంకు సోర్స్ పాయింట్ మార్చటంతో మనకు రోజు ఆంధ్రావాళ్లతో పంచాయితీ అవుతోంది. ఇప్పుడు మనం మీటింగ్ పెట్టుకున్న లక్ష్మీదేవి పల్లిలోని చౌదరి గూడెం తెలంగాణలోనే ఎత్తైన ప్రదేశం. ఇక్కడ రిజర్వాయర్ కడితే రంగారెడ్డి జిల్లాకు 4 లక్షలు, మహబూబ్ నగర్ జిల్లాకు 7 లక్షల ఎకరాలకు నీళ్లు ఇవ్వవచ్చు. కానీ బీఆర్ఎస్ చేసిన తప్పునే ఇప్పుడు కాంగ్రెస్ కొనసాగిస్తోంది.

రిజర్వాయర్లు కట్టి కమిషన్లు దండుకున్నారే తప్ప చుక్క నీళ్లు తేలేదు. మా ప్రభుత్వం కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. అప్పుడు ఇదే ప్రాంతంలో ప్రాజెక్ట్ కడుతామని మీకు మాట ఇస్తున్నా. మాట్లాడితే నల్లమల్ల పులి బిడ్డను అని చెప్పుకునే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఈ ప్రాంతానికి అన్యాయం చేస్తున్నారు. పాలమూరు బిడ్డలు కాంగ్రెస్ కు 12 సీట్లు ఇస్తే ఇప్పటి వరకు కనీసం తట్టెడు మట్టి కూడా ఎత్తి పోయలేదు. పాలమూరు కు మీరు చేస్తున్న ద్రోహానికి ప్రజలు మీ కాంగ్రెస్ పార్టీ ని కిలోమీటర్ లోతులో బొందపెడుతారు. పదేళ్లు పాలించిన బీఆర్ఎస్, ఇప్పుడున్న కాంగ్రెస్ కూడా దీనికి బాధ్యత తీసుకోకపోతే ఎవరికీ చెప్పుకోవాలి? చుక్క నీళ్లు ఇవ్వకుండా మోటార్లు, పంప్ లు అంటూ 6 వేల కోట్లు ఖర్చు చేశారు. కక్కుర్తితో కమిషన్లు తిని ప్రజలకు అన్యాయం చేశారు. ఈ పాపంలో జిల్లాలోని అందరూ కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు భాగం ఉంది. దసరా వరకు మీకు టైమ్ ఇస్తున్నాం. లక్ష్మీదేవి పల్లిలో రిజర్వాయర్ కట్టాల్సిందే. లేదంటే దసరా తెల్లారి నుంచే పాలమూరురంగారెడ్డి ప్రాజెక్ట్ పరివాహక ప్రాంతంలో పాదయాత్ర చేస్తాం. నేను చేసిన విమర్శలతో రేపటి నుంచి గులాబీ దండు నాపై ఆటాక్ చేస్తారు. కానీ మనం ఒక్కసారి ఆలోచించాలి. తెలంగాణలో పదేళ్లు అధికారం చెలాయించి చాలా జిల్లాల్లో ఒక్క ప్రాజెక్ట్ కట్టలేదు. ఆదిలాబాద్ లో తుమ్మిడి హెట్టి, వార్ధా కడుతామని చెప్పి అది కట్టలేదు. నిజామాబాద్ లో కొత్తగా ఒక్క ఎకరానికి కూడా నీళ్లు ఇవ్వలేదు. కరీంనగర్ లో ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి ప్రాజెక్ట్ లకు ఆయకట్టు స్థిరీకరణ మాత్రమే చేశారు. ఒక్క మెదక్ జిల్లాలో మాత్రమే లక్ష ఎకరాలకు నీళ్లు ఇచ్చారు. వరంగల్ లో కనీసం ఒక్క కొత్త ప్రాజెక్ట్ కట్టలేదు. 25 ఏళ్లుగా దేవాదుల కూడా పూర్తి చేస్తలేరు. నల్గొండలో ఒక్క కొత్త రిజర్వాయర్ లేదు. దిండికి కూడా నీళ్లు ఇవ్వాల్సి ఉన్న ఇవ్వలేదు. నల్గొండ జిల్లాకు నీళ్లు ఇచ్చేందుకు పాలమూరురంగారెడ్డి ని లింక్ చేస్తున్నారు. ఇవ్వాళ పేపర్లో వార్త చూస్తే బాధనిపించింది. కృష్ణాలో ఆంధ్రావాళ్లు 770 టీఎంసీలు వాడుకున్నారు. మనం 221 టీఎంసీలు మాత్రమే వాడుకున్నాం. మన దగ్గర పారుతున్న కృష్ణానది నీళ్లు ఆంధ్రాకు తరలిపోతున్నాయి. వాళ్లను మనం అనాల్సిందేమీ లేదు. తెలివిగా డ్యామ్ లు, చెక్ డ్యామ్ లు కట్టుకున్నారు. వాళ్ల ప్రజలకు మేలు చేసేందుకు అవినీతి చేయకుండా పనులు చేసుకున్నారు. బీఆర్ఎస్ కు పదేళ్లు ప్రజలు ఇచ్చిన అవకాశం పొగొట్టుకుంది. కాంగ్రెస్ రెండున్నరేళ్లు గడిచిన సరే బుద్ధి తెచ్చుకోవటం లేదు. కొడంగల్‌నారాయణ పేట్‌మక్తల్ పూర్తి చేస్తానని ముఖ్యమంత్రి అంటున్నాడు. రెండున్నర లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చే దాన్ని లక్ష ఎకరాలకు కుదించారు. అసలు ముఖ్యమంత్రి మొత్తం పాలమూరును కదా ముందు పూర్తి చేయాలి. కానీ అది చేయటం లేదు. నీటి విషయంలో జరిగిన అన్యాయాన్ని సరిచేసేందుకే తెలంగాణ రక్షణ సేన పుట్టింది. మేము అధికారంలోకి వచ్చాక జురాలను సోర్స్ గా తీసుకొని 10 లక్షల ఎకరాలకు నీళ్లు ఇస్తాం చేస్తాం, జురాలలో వరద నీళ్లు ఉంటాయి. ఎంత దమ్ముంటే అంత ఎత్తిపోసుకోవచ్చు. పేరుకు 2 టీఎంసీలే అంటారు. కానీ మనం ఐదు టీఎంసీలను 35రోజుల పాటు ఎత్తిపోసుకోవచ్చు. చేసే అవకాశం మనకు ఉన్నప్పటికీ పాలకులకు ఆ మనసు లేదు. ఇప్పుడు చెరువులు నింపి వదిలేస్తున్నారు. నిండిన చెరువులను పర్యవేక్షించేందుకు లష్కర్ లను నియమిస్తాం. వాళ్లు చెరువుల నుంచి నీళ్లు పొలాల వద్దకే వెళ్లే వరకు పర్యవేక్షిస్తారు. వాటర్ కమిషన్ ను కూడా నియమిస్తాం. ఇరిగేషన్, వాటర్ మేనేజ్ మెంట్ ను వాటర్ కమిషనే చూసుకుంటుంది. మీకు ప్రమాణం చేసి నేను మాట ఇస్తున్నా. నీళ్ల కోసం చేస్తున్న ఉద్యమానికి మాకు మద్దతివ్వండి. పాలమూరురంగారెడ్డికి జాతీయ హోదా ఇవ్వాల్సిన బీజేపీ కూడా మోసం చేస్తోంది. ఇక్కడి ఎంపీ అరుణమ్మ గారు 10 తారీఖున ఇక్కడకు వస్తున్న మోడీని అడిగి మనకు జాతీయ హోదా తేవాలి. జాతీయ హోదా తో పాటు, జనగణనలో బీసీ కాలమ్ ఉండాలి, అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పంపించిన బీసీ బిల్లుకు ఆమోదం తెలుపాలని ప్రధాని మోడీని డిమాండ్ చేస్తున్నా.



## ద్విచక్ర వాహనం పై నుండి పడి వ్యక్తికి గాయాలు

**జయభేరి, దంతాలపల్లి, మే 08:**

మండల కేంద్రం నుండి సూర్యాపేట రోడ్డు వైపుకు వెళుతున్న ద్విచక్ర వాహనదారుడు అదుపుతప్పి రోడ్డు సైడ్ గుంతలో పడి తీవ్రగాలు పాలైనాడు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అర్వపల్లి మండలం సీతారాం పురానికి చెందిన అంకిరెడ్డి ప్రశాంత్ తన సొంత పనిపై దంతాలపల్లి నుండి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో సాయంత్రం ఏడు గంటల సమయంలో ఈ ఘటన జరిగినట్లుగా తెలియ వచ్చింది, 108కు ఫోన్ చేయడంతో ఆ వ్యక్తిని ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు తెలియవచ్చు పూర్తి వివరాలు తెలియాల్సింది.

## గ్రామంలోకి రాకుండా హిజ్రాలపై నిషేధం..?

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణలో హిజ్రాల ఆగడాలు శ్రుతిమించడంతో నిజామాబాద్ జిల్లా భీమగల్ మండలం బడా భీమగల్ గ్రామ పెద్దలు కీలక నిర్ణయం తీసుకున్నారు. వారు ఊర్లోకి రాకుండా నిషేధం విధిస్తూ గ్రామ అభివృద్ధి కమిటీ విడిసి తీర్మానం చేసింది. పెళ్లిళ్లు, గృహప్రవేశాలు, ఇతర శుభకార్యాల సమయంలో రూ.వేలల్లో డబ్బులు డిమాండ్ చేస్తూ వేధింపులకు గురిచేస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మరి మీ ఏరియాలోనూ హిజ్రాల ఇబ్బందులు ఉన్నాయా.

## ఘనంగా వివాహ సంస్కార వేడుక

- హిందూ సంప్రదాయ వేడుకలలో దీపాలను వెలిగిస్తాం
- జన్మదిన వేడుకలు వివాహ వార్షికోత్సవ వేడుకలు హిందూ సంప్రదాయ ప్రకారం జరుపుకోవాలి.. వింజమూరి చంద్రమౌళి



**జయభేరి, కొండమల్లేపల్లి :**

కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన దొడ్డి సుధాకర్ నాగలక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకను గాయత్రీ పరివార్ కొండమల్లేపల్లి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతులకు పూలమాలలు వేసి దీపా యజ్ఞం చేసి గాయత్రి మంత్రోపదేశం చేశారు. ఈ సందర్భంగా గాయత్రీ నిర్వాహకులు వింజమూరు చంద్రమౌళి మాట్లాడుతూ మన హిందూ సంప్రదాయ వేడుకలలో దీపాలను వెలిగిస్తామని, దేవతామూర్తుల సాక్షిగా పూలు తలపై చల్లుకుంటామని అన్నారు. తల్లిదండ్రులు పెద్దల ఆశీర్వాదం తీసుకోవడం శుభ పరిణామం అన్నారు. భార్యాభర్తలు ఇద్దరు ద్వి శరీరాలు ఒకే ఆత్మగా కలిసి ఉండాలన్నారు. మన నడవడిక నలుగురికి ఆదర్శంగా ఉండాలన్నారు. అంతకు ముందు రోజు బచ్చు వెంకటేశ్వర్లు ధనమ్మ దంపతులకు, గంటగిరి శోభారాణి దంపతులకు వివాహ సంస్కారాన్ని ఘనంగా నిర్వహించారు. గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో జన్మదిన సంస్కారం వివాహ వార్షికోత్సవ సంస్కారం గాయత్రీ యజ్ఞం ఉచితంగా నిర్వహించబడునని ప్రతి హిందూ కుటుంబం ఈ గొప్ప అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమానంతరం భక్తులకు అల్పాహార వితరణ కార్యక్రమాన్ని సుధాకర్ నాగలక్ష్మి దంపతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాచేపల్లి వెంకటేశ్వర్లు, నూతన గంటి జగన్, నేలంటి వెంకటేశ్వర్లు, నీల లక్ష్మయ్య, బచ్చు వెంకటేశ్వర్లు, చెట్లపల్లి శ్రీనివాస్, బెలిదే రాజు, తెరాట్పల్లి శ్రీనివాస్, బండారు సుధాకర్ జయ శ్రీ, గాజుల వాణి, వేరుకొండ రాము, అలుగుబెల్లి నాగార్జున రెడ్డి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

- దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి



**జయభేరి, దేవరకద్ర :**

నిరుపేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని కొత్తకోట మండలం రామా నంతపురం లో శుక్రవారం గుర్రాల వెంకటమ్మ రాజకుమార్, గుర్రాల చంద్రమ్మ మాసన్న, భారతి తిరుపతయ్యల గృహ ప్రవేశ కార్యక్రమాలకు ఎమ్మెల్యే జిఎంఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తమ కుటుంబ తరపున నూతన వస్త్రాలు అందజేసి ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ మాట్లాడుతూ తమకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసి, తమ సొంతింటి కల నెరవేర్చిన ఎమ్మెల్యే జిఎంఆర్ కు వారు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాదగిరి రెడ్డి తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## దేవరకొండలో లోన్ కన్సల్టెన్సీ ప్రారంభం

- దేవరకొండ నియోజకవర్గం ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
- శుభాకాంక్షలు తెలియజేసిన పట్టణ ప్రజాప్రతినిధులు మిత్రులు
- మరింత సేవలు అందిస్తా మొహమ్మద్ లతీఫ్

**జయభేరి, దేవరకొండ :**

మారుతున్న కాలానికి అనుగుణంగా సులభతరహాలో ప్రజలందరికీ సేవలందించడం కోసం దేవరకొండ పట్టణంలోని ఎస్బిఐ బ్యాంక్ ప్రక్కన కన్సాల్టెన్సీ ప్రారంభించడం జరిగింది. హోమ్ లోన్స్ మార్ట్ గేజ్ లోన్స్ 100% గ్యారెంటీతో అందించేందుకు సకల సౌకర్యాలను కల్పిస్తున్నట్లు నిర్వాహకులు మొహమ్మద్ లతీఫ్ తెలిపారు. గురువారం ప్రారంభించిన ఈ కన్సల్టెన్సీ ప్రజలందరూ ఉపయోగించుకోవాలని తెలిపారు. ఇలాంటి కన్సల్టెన్సీ నిర్వహించడం ద్వారా సత్వర సేవలు అందుతాయని ప్రారంభానికి విచ్చేసిన పలువురు కొనియాడారు. రోజుల తరబడి బ్యాంక్ ల చుట్టూ తిరగకుండా ఒక్కసారి కార్యాలన్నీ సందర్శిస్తే తమ పనులు వెంటనే జరుగుతాయని తద్వారా సమయం ఆదావుతుందని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకున్ని శాలువతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## చల్లని మజ్జిగ పంపిణీ కార్యక్రమం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండలో బస్టాండ్ ఆవరణలో మోడల్ ఫోటో కలర్ ల్యాబ్ దేవరకొండ వారి ఆధ్వర్యంలో స్థానిక చేనేత సహకార సంఘం కాంప్లెక్స్ ముందు వేసవి కాలం కొంత ఊరట కోసం చక్కటి మజ్జిగ పంపిణీ కార్యక్రమం మోడల్ కలర్ ల్యాబ్ యాజమాన్యం మణిదీప్ ఆధ్వర్యంలో పంపిణీ కార్యక్రమం చేయడం జరిగినది. మజ్జిగ తాగిన వారు వేసవికాలంలో మజ్జిగ పంపిణీ కార్యక్రమం చేసినందుకు మోడల్ కల ల్యాబ్ యాజమాన్యం వారిని ప్రత్యేకంగా అభినందించినారు. ఈ కార్యక్రమంలో మణిదీప్, ఊరుకొండ రాజశేఖర్, మహేష్ , కాసిం, కృష్ణ, సూపర్, సత్యనారాయణ ఫోటోగ్రాఫర్లు తదితరులు పాల్గొన్నారు.


## వివాహ వేడుకకు హాజరైన మాజీ ఎమ్మెల్యే రెడ్యా నాయక్



**జయభేరి, దంతాలపల్లి, మే 08 :**

మండలం గున్నెపల్లి గ్రామానికి చెందిన కొండ సుధాకర్ ఉమా రాణి దంపతుల కుమార్తె కీర్తన వెడ్స్ విజయ్ వివాహ వేడుకకు హాజరై దంపతులను ఆశీర్వదించిన డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డి యస్ రెడ్యానాయక్ మాజీ ఎంపీపీ ఉమా మల్లారెడ్డి మద్దుల సుధాకర్ రెడ్డి పొన్నాల ఉమేష్ రెడ్డి ఉప్పల కృష్ణయ్య మద్దుల ఉప్పల్ రెడ్డి చిల్లా శ్రీనివాస్ రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్



**జయభేరి, దేవరకద్ర :**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ పరిధిలోని భూత్పూర్ మండలం తాటికొండలో శుక్రవారం చింతకాయల అనురాధమ్మ కి చెందిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ ఇంటి యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇంటి యజమానులకు తమ కుటుంబం తరపున నూతన వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైకాపా నేతలపై కేసులు పెడుతున్నారు

**జయభేరి, విశాఖపట్నం :**

స్పీకర్ అయ్యన్నపాత్రుడు అనుచరులే దాడి చేసి తమ నాయకులపై కేసులు పెట్టడం దారుణమని మాజీ మంత్రి అమర్ నాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా స్పీకర్ సొంత నియోజకవర్గంలో అక్రమ అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ఎల్లకాలం ఒకేలా ఉండదని, భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. చర్యకు ప్రతి చర్య ఉంటుందన్న విషయం టీడీపీ నాయకులు గుర్తించుకోవాలని సూచించారు.

# క్రేజీ హీరోయిన్ సీక్రెట్ లవ్ స్టోరీ..



ఒకప్పుడు టాలీవుడ్‌లో వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈ భామ, ప్రస్తుతం కాస్త గ్యాప్ తీసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ గ్యాప్‌ని ఆమె వృధా చేయడం లేదు, తన పర్సనల్ లైఫ్‌ను ఎంజాయ్ చేయడానికి కేటాయిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, పూజా హెగ్డే బాలీవుడ్ నటుడు రోహన్ మెహ్రాతో పీకల్లోతు ప్రేమలో ఉన్నట్లు తెలుస్తోంది. సాధారణంగా పూజా తన వ్యక్తిగత విషయాలను చాలా సీక్రెట్‌గా ఉంచుతుంది. గతంలో కూడా కొందరు హీరోలతో ఆమె పేరు ముడిపెట్టినా, ఆమె ఎప్పుడూ స్పందించలేదు. కానీ ఇప్పుడు రోహన్‌తో ఆమె క్లోజ్‌గా ఉంటున్న తీరు చూస్తుంటే, ఇది కేవలం పుకారు మాత్రమే కాదు అనిపిస్తోంది. ప్రస్తుతం ఆమె చేతిలో పెద్దగా సినిమాలు లేకపోవడం కూడా ఈ డేటింగ్ వార్తలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది. 35 ఏళ్ల వయసులో ఉన్న పూజా, తన లైఫ్ పార్ట్‌నర్‌ను వెతుక్కునే పనిలో పడిందా అనే చర్చలు ఫిల్మ్ నగర్‌లో జోరుగా సాగుతున్నాయి. ఏదేమైనా, ఈ బుట్టబొమ్మ తన రిలేషన్‌షిప్‌ను అఫీషియల్‌గా ఎప్పుడు అనౌన్స్ చేస్తుందో చూడాలి. మనసులో మాట బయటపెడితే ఫ్యాన్స్ కూడా హ్యాపీగా ఫీలవుతారు కదా!



## చరిత్రను ప్రశ్నిస్తున్న సంజయ్ దత్..
# 'ఆఖ్రీ సవాల్' ట్రైలర్ విడుదల!

బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ ప్రధాన పాత్రలో నటించిన 'ఆఖ్రీ సవాల్' మూవీ ట్రైలర్ తాజాగా విడుదలైంది. నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ అభిజీత్ మోహన్ వారంగ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం, భారతదేశ చరిత్రలోని వివాదాస్పదా అంశాలపై రాబోతున్నట్లు తెలుస్తుంది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. మహాత్మా గాంధీ హత్య వెనుక ఆరోపణలు, బాబ్రీ మసీదు కూల్చివేత, మరియు దేశంలో విధించిన ఎమర్జెన్సీ వంటి కీలక చారిత్రక ఘట్టాలను ఈ సినిమాలో ప్రశ్నించినట్లు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. ప్రొఫెసర్ గోపాల్ నద్కర్ణిగా సంజయ్ దత్ చాలా గంభీరమైన పాత్రలో కనిపించబోతున్నాడు. ఈ చిత్రంలో అమిత్ సాధ్, సమీరా రెడ్డి, నీతూ చంద్ర మరియు త్రిధా చౌదరి కీలక పాత్రల్లో నటించారు. చాలా కాలం తర్వాత సమీరా రెడ్డి ఈ సినిమాతో వెండితెరకు రీఎంట్రీ ఇస్తుండటం విశేషం. అంతేకాకుండా, ఈ సినిమా వినికిడి లోపం ఉన్న వారి కోసం 'ఇండియన్ సైన్ లాంగ్వేజ్' (ISL) సపోర్ట్‌తో విడుదల కాబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు.ఈ చిత్రం మే 15న గ్రాండ్‌గా విడుదల కాబోతుంది.

## యాక్షన్ సీక్వెన్స్ కోసం రిహార్సల్స్



ప్రభాస్ కథానాయకుడిగా సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్పిరిట్'. ఇప్పటికే ఈ సినిమా తాలూకు ఓ షెడ్యూల్ పూర్తయింది. గతంలో విడుదల చేసిన ఆడియో గ్లింప్స్‌కి అద్భుత స్పందన రావడంతో సినిమాపై మరింతగా అంచనాలు పెరిగాయి. తాజాగా ఈ సినిమాలోని కీలకమైన యాక్షన్ ఘట్టాల కోసం హీరో ప్రభాస్ స్పెషల్ రిహార్సల్స్ చేయబోతున్నారట. కాప్ స్టోరీగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో హై ఇంటెన్సిటీ యాక్షన్ సీక్వెన్సెస్ ఉంటాయని, అవే హైలైట్‌గా నిలుస్తాయని చెబుతున్నారు. దాంతో ఈ పోరాట ఘట్టాల్లో పర్‌ఫెక్షన్ కోసం ప్రభాస్ రిహార్సల్స్ చేస్తున్నారని తెలిసింది. ఈ సినిమాలో ప్రభాస్ చాలా వరకు బరువు తగ్గికనిపిస్తారని, తొలిసారి పోలీస్ అధికారి పాత్రలో నటిస్తుండటంతో ఫిట్‌నెస్‌పై ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, ప్రభాస్ మేకోవర్ అందరినీ సర్‌ప్రైజ్ చేస్తుందని అంటున్నారు. టీ సీరిస్, భద్రకాళి ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. వచ్చే ఏడాది మార్చి 5న ప్రేక్షకుల ముందుకురానుంది.



# అనుకున్నదొకటి జరిగిందొకటి!

నటి సమంతకు కథానాయికగా ఎంత క్రేజ్ ఉందో, ఫ్యాషన్ ప్రపంచంలో కూడా అంత క్రేజుంది. తాజాగా 'ది నోడ్' అనే మ్యాగజైన్ కవర్ పేజీ కోసం సమంత ఫొటో షూట్ చేసింది. ప్రస్తుతం ఆ ఫొటోలు సోషల్ మీడియాలో సంచలనంగా మారాయి. సమంతలోని సరికొత్త ఎనర్జీని ఆవిష్కరించేలా ఈ ఫొటోలున్నాయి. వీటిలో ఆమె ధరించిన అవుట్‌ఫిట్స్, సామ్ మేకోవర్ డిఫరెంట్‌గా ఉందని అంటున్నారు. ఇదిలావుంటే.. ఈ ఫొటోలను తన ఇన్‌స్టాలో షేర్ చేస్తూ, తన కెరీర్ తొలినాళ్ల ముచ్చట్లను సమంత పంచుకున్నది. 'నాది ఓ ఊహించని సినిమా ప్రయాణం. అమ్మానాన్నకు మేం ముగ్గురం పిల్లలం. నేను చిన్నదాన్ని. అసలు నటిని కావాలనే ఆలోచనే నాకప్పట్లో లేదు. కాలేజ్ తర్వాత వచ్చిన చిన్న గ్యాప్‌లో సరదాగా మోడలింగ్ వైపు వెళ్లాను. ఈ క్రమంలోనే ఓ సినిమా ఆడిషన్‌కి వెళ్లి హీరోయిన్‌గా సెలక్టయిపోయాను. ఓ ఏడాది పాటు సినిమాలు చేసి, మళ్లీ కాలేజ్ కెళ్లి చదువుకుందాం అనుకున్నా. కానీ ఈ గ్లామర్ ప్రపంచం నన్నొదల్లేదు' అంటూ రాసుకొచ్చింది సమంత.

## 'సతీ లీలావతి' రివ్యూ..
# లావణ్య త్రిపాఠి ఫ్యామిలీ డ్రామా అలరించిందా?



వివాహం తర్వాత కొన్నేళ్ళు విరామం తీసుకున్న లావణ్య త్రిపాఠి.. ఇప్పుడు 'సతీ లీలావతి' సినిమాతో ప్రేక్షకులు ముందుకు వచ్చారు. 'భీమిలి కబడ్డీ జట్టు' ఫేం తాతినేని సత్య దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. భార్య భర్తల కథగా తెరకెక్కిన ఈ చిత్రం ప్రేక్షకులకు వినోదాన్ని పంచిందా? రివ్యూలో చూద్దాం!

అగ్ర దర్శకురాలు లీలావతి (లావణ్య త్రిపాఠి) కొన్ని కారణాలు వలన మానసిక భయాలతో పెరుగుతుంది. సైకాలజిస్ట్ రామ్ సేతు (దేవ్ మోహన్) సహాయంతో ఆ భయాల నుంచి బయటపడి అతడినే ప్రేమించి పెళ్లి చేసుకుంటుంది. అయితే మూడేళ్ల తర్వాత సేతు మరో అమ్మాయి (మడోన్నా సెబాస్టియన్)తో ప్రేమలో ఉన్నానని చెప్పి విడాకులు కోరుతాడు. దీంతో లీలా అతడిని ఇంట్లో బంధిస్తుంది. ఆ తర్వాత వారి సంబంధం ఏ మలుపు తిరిగింది? చివరికి ఇద్దరూ విడిపోయారా లేదా కలిశారా? అనేదే మిగతా కథ. సతీ లీలావతి ఈ తరం వైవాహిక జీవితాల్లో పెరుగుతున్న దూరాలు, ఈగోలు, అపార్థాల చుట్టూ తిరిగే కథ. విడాకులు ఇప్పుడు చాలా సాధారణమైపోయిన కాలంలో... బంధాన్ని కాపాడుకోవడం కూడా ఒక బాధ్యత అనే పాయింట్‌తో దర్శకుడు తాతినేని సత్య కథను తీర్చిదిద్దారు. ఆ ఉద్దేశం మంచిదే. కానీ ఆ ఎమోషన్ ని తెరపై ఆసక్తికరంగా మలచడంలో మాత్రం సినిమా పూర్తిగా సక్సెస్ కాలేకపోయింది. లీలావతి, రామ్ సేతు మధ్య జరిగే గొడవలు, విభేదాలు కథలో ప్రధానాంశం. అయితే సన్నివేశాల్లో కొత్తదనం లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ఫ్యామిలీ డ్రామాగా మొదలైన కథలో అవసరం లేని ట్రాక్స్ మధ్యలోకి రావడంతో అసలు ఎమోషన్ డైవర్ట్ అయిపోతుంది. వీటీవీ గణేష్, సప్తగిరి ట్రాక్స్ నవ్వించకపోగా ఇంపాక్ట్ ని తగ్గించాయి. ఫస్ట్ హాఫ్‌లో కథ కొంతమేర ముందుకు కదిలినా... సెకండ్ హాఫ్ పూర్తిగా గందరగోళంగా మారుతుంది. కిడ్నాప్ డ్రామా, సిల్లీ ట్విస్టులు, యాక్షన్ ఎపిసోడ్స్ కథలో సహజత్వాన్ని తగ్గించాయి. క్లైమాక్స్‌ని థ్రిల్లింగ్‌గా ముగించాలనుకున్నా ఆ ఎమోషనల్ కనెక్ట్ రాలేదు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at **Sri Muktheswara Publications**, Plot No. 31, Mallikarjuna Nagar Colony, Sagar Ring Road, Bairamal Guda, Hyderabad-500079, Dist. Rangareddy, Telangana. Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**